స్వప్నవాసవదత్త నాటకము

(షష్ఠాంకములు)

రచయిత

చిలకమర్తి లక్ష్మీనరసింహము

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2007

SWAPNA VASAVADATTA
(NATAKAMU)
By
CHILAKAMARTHI LAKSHMINARASIMHAM

T.T.D. Religious Publications Series No:699

© All Rights Reserved

T.T.D First Edition : 2007

Copies:1000

Published by
A.P.V. Narayana Sarma, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati-517 501.

DTP by
M/S SAR Infotec (P) Ltd,
15-3-200,G.N.Mada Street,
Tirupati- 517507.

Printed at
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

ముందుమాట

వాఙ్మయంలో నాటకానికొక విశిష్టమైన స్థానముంది. ఏదైనా వొక విషయాన్ని పాత్రల ద్వారా ప్రత్యక్షంగా కన్నులముందు జరుగుతూ వున్నట్లుగా రంగస్థలం మీద ప్రదర్శించ బడటం వల్ల నాటకం సామాజికుల హృదయాలపై ఆధిపత్యం వహిస్తూవుంది. రసానుగుణంగా, ఔచిత్యపూర్వ కంగా పాత్రల స్వరూప స్వభావాల్ని చిత్రించి నాటకరచన చేయడం సామాన్య కవుల కసాధ్యం. ఇందులోని క్లిష్టతను గుర్తించే, 'నాటకాంతం హి సాహిత్యమ్' అని అలంకారికులు వివరించు చున్నారు. సంస్కృతంలో ఈ శాఖ ప్రాదుర్భా వానికి కారకుడు భాసమహాకవి.

భాసుడు తన నాటకాల్లో ఎక్కడా తనదేశకాలాల్ని గూర్చి చెప్పు కోలేదు. కానీ మహాకవి కాళిదాసు పూర్వుడని నిర్ణయించవచ్చు. భాసుడు రచించిన నాటకాలు 13. వాటిలో ప్రతిమ, అభిషేకం రామాయణ గాధకు చెందినవి. ప్రతిజ్ఞా యౌగంధరాయణ, స్వప్నవాసవదత్త నాటకాలు కథా సరిత్సాగరాన్ని అనుసరించాయి. అవిమారకం, చారుదత్తం కల్పిత కథలు. మధ్యమవ్యాయోగము, పంచరాత్రము, దూతవాక్యము, దూత ఘటోత్కచము, కర్ణభారము, ఊరుభంగము భారతగాధకు సంబంధించినవి. కాగా బాలచరితం హరి వంశాన్ని అనుసరించింది.

స్వప్నవాసవదత్తం భాసుని నాటకచక్రంలోనే గాక సంస్కృత నాటక ప్రపంచంలోనే అసామాన్యమైందని ప్రశస్తి వహించింది. కాళిదాసాదుల నాటకాల కిది ఏమాత్రం తీసిపోదు.

మానవ మనస్తత్వం ఏయేసంఘటనల్లో ఏవిధంగా మారుతూ వుంటుందో మనకు అవగతమవుతుంది. నిర్మలప్రేమ ఆదర్శదాంపత్యం అనేవాటికి ఈ నాటకం అద్దం లాంటిదని చెప్పవచ్చు. అంతేగాక ప్రసన్నమూ, మధురమూ ఐన భాసుని మనోజ్ఞ శైలీ విన్యాసానికిది ప్రత్యక్షసాక్ష్యం.

ఈ నాటకాన్ని సుప్రసిద్ధ పండిత కవి శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు సరళమైన రీతిలో, తెలుగుదనం వెల్లివిరిసే లాగా ఆంధ్రీకరించారు. ఉత్కృష్టమైన ఈ నాటకాన్ని తెలుగువారికి అందించటం ఉచితమనే వుద్దేశంతో తిరుమల తిరుపతి దేవస్థానములు దీన్ని ప్రచురించింది. రసజ్ఞులు ఆదరిస్తారని నమ్ముతున్నాం.

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు.

చిలకమర్తి లక్ష్మీనరసింహ కవి జీవిత సంగ్రహము.

బాల్యదశ - విద్యాభ్యాసము.

బ్రహ్మశ్రీ చిలకమర్తి లక్ష్మీ నరసింహముగారు క్రీ.శ. 1867 సంవత్సరము సెప్టెంబరు నెల 26 తేదికి సరియైన ప్రభవసంవత్సర భాద్రపద నాఁటి రాత్రి ప్రస్తుతము పడమటిగోదావరీమండలమునందలి తణుకు తాలూకాలోనున్న ఖండవల్లి గ్రామమున, మాతామహగృహమున జన్మించిరి. ఋగ్వేది, అశ్వలాయనసూత్రుఁడు. కాశ్యపగోత్రుఁడు. ఈయనతాతగారి పేరు పేరుభట్టు. వ్యవహారములో నీయన పేరయ్యయని చెప్పఁబడుచు వచ్చెను. తండ్రిగారిపేరు వెంకన్నగారు. తల్లిగారిపేరు రత్నమ్మగారు. లక్ష్మీనరసింహంగారి పితామహుఁడు పేరుభట్టుగారు మొదట గుంటూరు మండలమందలి అద్దంకిసీమలో నేదోయొకగ్రామమున నివసించుచు 1830 సంవత్సరము ప్రాంతమున నచ్చట గొప్పకాటకమురాగాఁ దనకుటుంబ ముతోఁ గూడ గోదావరీప్రాంతమున వసింపఁదలఁచి మొట్టమొదట మొగలి తుఱ్ఱు గ్రామమున గొంతకాలముండి, పిమ్మట వీరవాసరగ్రామముఁజేరిరి. కాఁబట్టి లక్ష్మీనరసింహముగారిది ప్రస్తుతము పడమటి గోదావరీమండల ములో భీమవరము తాలూకాలోనున్న వీరవాసరము నివాసస్థానము.

ఈయన పితామహుఁడు వైదికవృత్తిచేత జీవించెను. తండ్రి వెంకన్నగారు వైదికవృత్తి నవలంబింపక మొదటినుండియుఁ జక్కగా వ్రాయుట, చదువుట, లెక్కకట్టుట నేర్చికొని, యచ్చటి తాలూకా కచ్చేరిలోఁ గొంతకాల ముద్యోగము చేసి, వేషభాషల చేతను వృత్తిచేతను లౌకికుఁడై జీవయాత్రగడపెను. లక్ష్మీనరసింహముగారి తల్లి రత్నమ్మగారు, ఖండవల్లి గ్రామీణుఁడును సంస్కృతాంధ్ర సారస్వతపారీణుఁడును, నుభయభాషా కవితావిశారదుఁడునునగు పురాణ పండ భద్రయ్యశాస్త్రిగారి రెండవ కూఁతురు. ఆంధ్రగీర్వాణవాఙ్మయ ధురంధరుఁడై యమలాపురము,

తణుకు మొదలగు తావులయందే గాక పిఠాపురమునందును జాలకాల మున్నతపాఠశాలలలో నాంధ్రోపాధ్యాయుఁడుగానుండి శ్రీపిఠాపురము మహారాజు గారగు శ్రీరాజారావు వేంకటకుమారమహీపతి సూర్యారావు బహద్దూర్ వారి యాస్థానపండితుఁడై యనేకాంధ్రప్రబంధము లకు వ్యాఖ్యాన ములురచించి, యాంధ్ర బ్రహ్మసూత్ర భాష్యకర్తయై వాక్చమత్కృతికి సౌజన్యతకుఁ బేరు పడియాంధ్రమండలమందు విశేషకీర్తిని గాంచిన శ్రీపురాణ పండమల్లయ్య శాస్త్రిగారు లక్ష్మీనృసింహంగారికి మేనమామ.

చిలకమర్తి వెంకన్నగారి పురుషసంతానములో లక్ష్మీనరసింహము గారే జ్యేష్ఠులు. ఈయన చిన్ననాఁడు వీరవాసరములో మొదటి నాలుగు తరగతులు జదివి యప్పటిపరీక్షాధికారియగు నల్గ్జాండర్ మన్రోదొరగారివల్ల మంచియింగ్లీషు నిఘంటువును బహుమానమును బడసి మిడిల్ స్కూలు పరీక్షకుఁ జదువుటకై నరసాపురమునకుఁ బోయి యచ్చట మిషనువారి పాఠశాలలో 1882 సంవత్సరప్రారంభమునఁ జేరెను. ఆసంవత్సరమే మిడిల్‌స్కూలు పరీక్షల్లో శ్రీ యేలేశ్వరపు వెంకటప్పయ్య శాస్త్రిగారు వీరి కాంధ్రభాషాగురువులైరి. కవిత్వము చెప్పవలెననునభిలాష 1883 సంవత్సరమున జనించెను. అందుచే ఛందశ్శాస్త్రము నేర్చుకొనవలెనని ఛందోవిషయ సారసంగ్రహమను లక్షణ గ్రంథమును జదివిరి. 1884 సంవత్సరమున మేనమామగారైన బ్ర!! శ్రీ!! పురాణపండ మల్లయ్య శాస్త్రిగారు రాజమహేంద్రవరములో నున్న యిన్నీసు పేట పాఠశాలలో నాంధ్రోపాధ్యాయులై, మేనల్లుని దనవెంటఁబెట్టుకొనివచ్చిరి. 1885 సంవత్సరమున లక్ష్మీనరసింహముగారు దొరతనము వారి కళాశాలలో మెట్రిక్యులేషను తరగతిలోఁ జేరిరి. అట్లు చేరుటచేత మహనీయులైన రావ్‌బహద్దూర్ కందుకూరి వీరేశలింగము పంతులు గారియొద్దను, వావిలాల వాసుదేవశాస్త్రిగారి యొద్దను, ప్రకృతిశాస్త్ర పండితులైన శ్రీరంగాచార్యులుగారి యొద్దను శిష్యుఁడై విద్యాభ్యాసము చేయుట కవకాశము గలిగెను.

కాని యాసంవత్సరాంతమున గవర్నమెంటువారి కళాశాలలో మెట్రిక్యులేషను తరగతి తీసివేయఁబడుటచే మఱియొక పాఠశాలలోఁచేరి చదివిరి. ఆపాఠశాలకు బ్ర॥ శ్రీ॥ వేదం వెంకటాచలంపంతులు గారు ప్రధానోపాధ్యాయులై యుండిరి. మేనమామగారైన మల్లయ్య శాస్త్రులు గారే యిక్కడ నాంధ్రోపాధ్యాయులు. అందుచేత మల్లయ శాస్త్రిగారి కాయన మేనల్లుఁడగుటయేగాక శిష్యుఁడుగూడ నయ్యెను. 1887 సంవత్సరమునఁ బ్రవేశపరీక్షయం దాయన కృతార్థుఁడయ్యెను. కళాశాలలోఁ బ్రథమశాస్త్ర పరీక్షకుఁ బట్టపరీక్షకుఁ జదువ వలెనని కుతూహల మీయనకు మెండుగ నుండెనుగాని, ప్రధానమగు గణిత శాస్త్రమందభిరుచి లేకపోవుటయు, నేత్రావరోధ మప్పటికే జనించుటయు నాయన నీసంకల్పమునుండి మరల్చెను.

ఉద్యోగము

1989 సంవత్సరమున మేనమామగారికి జబ్బుచేయుటచేత, లక్ష్మీనరసింహముగా రదివఱకే తెలుఁగులో గొంతపాండిత్యము సంపాదించి యున్నకతన వారిస్థానమున నాంధ్రోపాధ్యాయులుగా నిన్నిసు పేటపాఠశాల లో నియమింపఁబడిరి.

1889 సంవత్సరము ప్రారంభమున రాజమహేంద్రవరము నందలి కొందఱు మిత్రులు ప్రాతయూరునందొక యున్నతపాఠశాల స్థాపింపఁ దలంచి "ఆర్యన్ హైస్కూల్" అను పేర నొకదానిని నెలకొల్పిరి. లక్ష్మీనర సింహముగా రందులో నాంధ్రోపాధ్యాయుఁడుగా నియమింపఁబడి చిన్న తరగతుల కాంగ్లేయభాషయుఁ బెద్దతరగతులకు నాంధ్రభాషయు నేర్పుచుండిరి. కాని యాపాఠశాల వేసవికాలపుసెలవులనాటికంతరించెను. 1892 సంవత్సరము జూలైనెలలో నిన్నిసుపేట స్కూలులో నీయన సహా యోపాధ్యాయుఁడుగా నియమింపఁబడి 1893 సంవత్సరాంతము వఱకు నందుఁ బనిచేసెను.

1894 సంవత్సర ప్రారంభమున గవర్నమెంటువారు రాజమహేంద్రవరమున ట్రెయినింగు కాలేజిని స్థాపించిరి ఈ పట్టణములలో నున్న పాఠశాలలన్నియు దానిలోఁ గలుపఁబడుటచే వీరియుద్యోగము పోయెను. అప్పుడు మరల నాలుమాసములవఱ కేయుద్యోగము లేక యాసంవత్సరము జూలై నెలలో ట్రెయినింగుకాలేజిలో సెకండరీగ్రేడు ట్రెయినింగుతరగతిలోఁ జేరిరి. 1895 సంవత్సరము ఏప్రెలునెలతో నచ్చటివిద్యసమాప్తముకాఁగా, నూతనముగ స్థాపితమైన మ్యునిసిపల్ స్కూలులో వీరు మూడవ యుపాధ్యాయులుగా నియమింపఁబడిరి. ట్రెయినిం గయిన తరువాత జరిగెడు వ్రాతపరీక్షలో లక్ష్మీనరసింహముగారు కృతార్థులైరి. కాని నేత్రావరోధముచేత రెండవదియగు ప్రాక్టికలుపరీక్షలోఁ గృతకృత్యులగుట కష్టమని దానివిషయమై ప్రయత్నముచేయలేదు. ఆపరీక్షకుఁగూడ పెళ్ళవలసినదని పరీక్షాధికారులు నిర్బంధించిరి. అందుచే మ్యునిసిపల్ మిడిల్ స్కూలులో 1898 సంవత్సరము ఆగష్టువఱకు నసఁగా మూడుసంవత్సరములు మూడుమాసములు పనిచేసి యాయుద్యోగము నా యన వదులుకొనిరి

కీ|| శే|| శ్రీ పోలవరము జమీందారుగారును, లక్ష్మీనరసింహము గారును బాల్యమిత్రులగుటచే వారు సరస్వతియను మాసపత్రికను నెల కొల్పి దాని కుపసంపాదకుఁడుగా లక్ష్మీనరసింహముగారి నేర్పఱచిరి. కాని జమీందారుగారికిని వీరికి నభిప్రాయభేదములు గలుగుట చేత 1899 సంవత్సరములో వీరు సరస్వతీపత్రికతో సంబంధముగూడ వదులు కొనిరి.

గ్రంథరచనము

ప్రవేశపరీక్షకుఁ జదువుచున్న కాలముననే యాయన తెనుఁగునఁ గవిత్వముజెప్ప నారంభించెను. 1887 సంవత్సరము ప్రారంభమున శ్రీ విక్టోరియా మహారాజ్ఞిగా రేబదియేండ్లు పరిపాలనము చేసినందుకు దేశమం దంతట గొప్పయుత్సవములు జరిగెను. అప్పుడు లక్ష్మీనరసింహముగారు

రాణీగారిమీఁదఁ గొన్నిపద్యములు జదివిరి. అవి చక్కగానున్నవని సభాసదులు మెచ్చి సంతసించిరి ఆయనకవిత్వము వెల్లడికి వచ్చుట కదియే మొదలు. కాని లక్ష్మీనరసింహముగారిని సంపూర్ణముగఁ గవిత్వధోరణిలోనికి దింపినవి రెండు సంస్థలని చెప్పవచ్చును. ఇందు మొదటిది నాటకకళాభిలాషులగు కీ॥శే॥ ఇమ్మానేని హనుమంతరావు నాయుడు గారు 1889 సంవత్సరమున స్థాపించిన హిందూనాటక సమాజము. రెండవది సుప్రసిద్ధాంధ్రులును, దేశభక్తాగ్రేసరులలో వన్నెకెక్కిన న్యాపతి సుబ్బారావు పంతులు గారిచే 1891 సంవత్సరములో నెలకొల్పఁబడి కీ॥శే॥ రావుబహదూర్ కందుకూరి వీరేశలింగకవిచే నతిసమర్థతతో నిర్వహింపఁబడు చువచ్చిన "చింతామణి" యను మాసపత్రిక. ఈ రెండు సంస్థలును భాషాభివృద్ధి కేర్పడినవిగాని ద్రవ్య మార్జించుటకుఁ గాదు. గద్యనాటకములనే ప్రదర్శించుట నాయుడుగారి మతము. ఆంధ్రవాఙ్మయమున నవలారచనము లేనిలోటు దీర్పవలెనని పంతులుగారి దీక్ష. ఇది నెరవేరుటకు, పోటీకి నవలలువ్రాయించి చింతామణిలోఁ బ్రకటించి యుత్తమగ్రంథములకు పంతులుగారు స్వయముగఁ బారితోషికముల నిచ్చుచుండిరి. ఈ రెండుసంస్థలే లక్ష్మీనరసింహముగారిని విశేషముగ గద్యకవిగఁ బరిణమింపఁజేసినవి.

ఈయన నాటకసమాజమునకు మొట్టమొదట వ్రాసియిచ్చినది కీచకవధ యనువచననాటకము. దీనిని ముగించుటకు నాలుగుమాసములు పట్టెను. 1889 సంవత్సరం జూన్ 15వ తేదిని సామాజికులు ప్రదర్శించిరి. ప్రేక్షకులు మెచ్చుటచేత ననతికాలములో మఱికొన్నినాటకములను వ్రాయవలసివచ్చెను. ఈరీతిగ ద్రౌపదీపరిణయము, గయోపాఖ్యానము, రామజననము, సీతాకల్యాణము, పారిజాతాపహరణము, నలనాటకము ననుదృశ్యకావ్యములను గ్రమముగ రచియించి ప్రదర్శనార్థమై సామాజికుల కిచ్చిరి. నాటకసమాజమునకుఁ గేవల మాస్థానకవియే గాక లక్ష్మీనరసింహముగా రొకముఖ్యసభ్యులుగా నుండుటచేత

గ్రంథరచనము చురుకుగా జరిగినది. సామాజికులలో వేషధారుల సంగీత సామర్థ్యమునుబట్టి కవి యచ్చటచ్చటఁ గొన్నిపద్యములను జేర్చినను మొత్తము మీఁదఁ బైనాటకము లన్నియు గద్యాత్మకములని చెప్పవచ్చును.

చింతామణి పత్రికాస్థాపనానంతరము లక్ష్మీనరసింహముగారి దృష్టి నవలారచనముపైఁ బ్రసరించినది. 1894 సంవత్సరము మొదలుకొని రామచంద్రవిజయము, హేమలత, అహల్యాబాయి యనుమూడు నవలలు పోటీపరీక్షార్థము వ్రాయఁబడినవి. ఇవి మొట్టమొదటఁ జింతామణిపత్రికలోఁ బ్రచురితములై ప్రథమబహుమానములను బడసినవి.

గ్రంథరచనమునందేగాక పత్రికానిర్వహణమునందుఁ గూడ లక్ష్మీనరసింహము గారికిఁ గుతూహల ముండెను. ఈ పత్రికలు వార్తా విషయములకే గాక గ్రంథప్రకటనమునకుఁ గూడ నుపకరించుచుండెడివి. సరస్వతీపత్రికకు పోలవరము రాజాగారితో నుపసంపాదకుడుగనున్నప్పుడు సౌందర్యతిలక యను నవలయు, అభినవభట్టబాణకృత పార్వతీపరిణయ మను సంస్కృతనాటకమున కాంధ్రీకరణమును వెలువడినవి.

1908 సంవత్సరమున జమీందారులగు శ్రీ కంచుమర్తి వేంకట సీతా రామచంద్ర రావుగారి సాహాయ్యమున నొక ముద్రణాలయము సంపాదించి మనోరమ యనుమాసపత్రికను నెలకొల్పి యందు ప్రసన్న యాదవము, కర్పూరమంజరియొక్క ప్రథమభాగము, మహాపురుషుల జీవితచరిత్రములు, రాజస్థానకథావళి, నానకు మొదలగు సిక్కుగురువుల చరిత్రములను నుద్గ్రంథములను బ్రకటించిరి. ఇవిగాక వినోదములును చమత్కారకథలును, చతురచంద్రహాస నాటకము యొక్కయు, రమేశచంద్ర దత్తుగారి సుధాశరచ్చంద్రము యొక్కయు కొన్ని భాగములును నీమనోరమ యందే ప్రకటింపఁబడినవి. ఈచివర రెండుగ్రంథములను 1919 సంవత్సరములో కవి పూర్తిచేసెను.

1910 సంవత్సరమున మనోరమనుచాలించి దేశమాత యనుపత్రికను బ్రకటింపఁజొచ్చిరి. ఇది వారపత్రికయైనను కొన్నిగ్రంథముల నిందు

మూలముగఁ బ్రకటించిరి. కృష్ణవేణి, మణిమంజరి యనునవలలును, భారతకథామంజరి యనునీతి కథలును దేశమాతలోనివే. ఈ ప్రహసన సంపుటములో దేశమాతలోని హాస్యలత లనేకములు చేర్పఁబడినవి. 1916 సంవత్సరమున దేశమాతకుఁదోడు మనోరమకు పునర్జీవముఁబోసి కొంతకాలము రెండుపత్రికలను నడిపిరి. గణపతి, రాజరత్న మను నవలలును, రఘువంశమున కనువాదమగు రఘుకులచరిత్ర మనువచన ప్రబంధమును, సిద్ధార్థచరిత్రయు, భాసమహాకవికృతనాటకములలో నైదింటి యాంధ్రీకరణములును రెండవతూరి వెలువడిన మనోరమలోఁ బ్రకటింపఁ బడెను. ఇంతకుపూర్వమే మధ్యమయోగమును స్వప్నవాసవదత్తయు నాంధ్రీకరింపఁబడినవి. ప్రచ్ఛన్నపాండవమను వచనప్రబంధమును, రామ కృష్ణ పరమహంసచరిత్రయు, కాళిదాస చరిత్రయు పత్రికా ముఖమునఁ గాక ప్రత్యేక గ్రంథరూపమున వెలువడినవి భాగవతకథామంజరి, ప్రహ్లాదచరిత్ర, కర్పూరమంజరియొక్క రెండవభాగము నముద్రితములు. ఇవి ప్రత్యేకించి షష్టిపూర్తి ముద్రణమునకై వ్రాసిరి.

నాటకములు నవలలు మాత్రమే గాక లక్ష్మీనరసింహముగారు కొన్ని పద్యకావ్యముల రచించిరి. కాని యవి పూర్తికాలేదు. 1895 సంవత్సరమున పృథివీరాజీయమను ప్రబంధమును వ్రాయ నారంభించిరికాని పూర్తిచేయ లేదు. ఇట్లే హరిశ్చంద్రనాటకమున నొకయంకము మాత్రము వ్రాసి చాలించిరి. దీనకల్పద్రుమ మనుభక్తిరసప్రధానమగు శతకమున నఱువదిపద్యముల వఱకు వ్రాసి మనోరమలోఁ బ్రకటించిరి. ఇవిగాక వీరుసమయస్ఫూర్తిగ చాటుధారగఁ జెప్పినపద్యములు గూడ గలవు. అందు ప్రథమగోదావరీమండల సభలోఁ జదివిన పన్నులపద్యములును, పకోడీల పైనఁ జెప్పినపద్యములును, ఆంధ్రదేశమున నెక్కుడు ప్రచారములో నున్నవి. వీరి పద్యకావ్యములలో న్యాపతి సుబ్బారావుగారి ప్రోత్సాహమువలన వ్రాసిన వాల్మీకి రామాయణసంగ్రహ మొకటియే సమగ్రముగ నిలిచి యున్నది.

చిన్నవిపెద్దవి గలిసి రమారమి తొంబది గ్రంథములకు లక్ష్మీనరసింహ ముగారు కర్త. వీనిలోఁ జాలభాగ మాంధ్రమహాజనుల నాకర్షించి గౌరవ ప్రేమాతిశయములకుఁ బాత్రములైనవి. గయోపాఖ్యానము సుమారు లక్షప్రతులు చెల్లినవి. నవలలలో హేమలత పెక్కుముద్రణముల నందుటయేకాక ఇంగ్లీషు, కన్నడము, ఓఢ్రభాషలలోనికిఁ బరివర్తనము చేయఁబడినది. తెలుఁగువాఙ్మయమున గద్యకావ్యములు సకృతుగ నున్నకాలములో నాబాలగోపాలము నాకర్షించి మనోహరముగు సులభశైలిలో వ్రాసిన లక్ష్మీనరసింహకవికృతు లాంధ్రసారస్వతమునకు మహోపకారము చేసిన వనుట యతిశయోక్తికాదు.

విద్యావ్యాపకము

దానములలో నన్నదానమువలె విద్యాదానము గూడ సర్వోత్కృష్టమయిన దని లక్ష్మీనరసింహముగారి నమ్మకము. తమగ్రంథముల వలననే గాక పాఠశాలలను స్థాపించి విద్యావ్యాప్తిచేయుటకుఁ బ్రయత్నించిరి. 1899 సంవత్సరారంభమున "హిందూ లోయర్ సెకండరీస్కూల్" అనుపేర నొక పాఠశాలను స్థాపించి తొమ్మిది సంవత్సరములు దాని నవిచ్ఛిన్నముగ నిర్వహించిరి. ఈ పాఠశాలలో నూటికి నలుబది మందిబాలు రుచితముగ విద్యాభ్యాసముఁజేయుచుండిరి. ఈ పాఠశాలను నిర్వహించుటలో లక్ష్మీనరసింహము గారికిఁ గొందఱుమిత్రులు తోడ్పడిరి. ఇందు ముఖ్యముగఁ దక్కువజీతమున కుపాధ్యాయత్వము నంగీకరించిన కుందూరు వెంకటరత్నముగారికిని, అగర్భశ్రీమంతులయ్యును శ్రమయనక వేతనముఁ బుచ్చుకొనకయె యేడుసంవత్సరములు ప్రధానోపాధ్యాయులుగనుండి పాఠశాలను మిక్కిలి యభివృద్ధిలోనికిఁ దెచ్చిన కీర్తిశేషులగు సత్యవోలు లక్ష్మీపతిగారికిని వారు యావజ్జీవము కృతజ్ఞులుగా నుండఁగలరు.

1906 సంవత్సరములో కీ॥శే॥ వీరేశలింగముపంతులుగా రొకయాస్తిక పాఠశాలను స్థాపింపనుద్యుక్తులై లక్ష్మీనరసింహముగారి

స్కూలు నీయవలసినదని కోరిరి. అందుకని 1907 సంవత్సరము సెప్టెంబరు 16 తేది పరికరములతో సహా తమ పాఠశాల నుచితముగ వీరేశలింగముగారి వశము చేసిరి. అది కొంతకాలము హితకారిణీ హైస్కూలను పేర వర్ధిల్లి యిప్పుడు శ్రీపిఠాపురము మహారాజావారి యౌదార్యము రూపముదాల్చినట్లు వెలయుచున్న దివ్యభవనమున వీరేశ లింగము హైస్కూలను పేరుతో దినదినాభివృద్ధిఁ గాంచుచున్నది.

ప్రజాహితజీవనము

లక్ష్మీనరసింహముగారి కెప్పుడు వైదికమతకర్మలయం దాసక్తియు న్నట్లుదోఁచదు. శ్రోత్రియవంశములోఁ బుట్టినందున గర్భాష్టకాలుదాటక మునుపే యుపనయనము జేసిరి. కాని తన స్నేహితుఁడగు నొకయంబష్ఠసూనునకు గాయత్రీమంత్రోపదేశము చేయుట జూచి గురువుగారు లక్ష్మీనరసింహముగారికి సంధ్యావందనము జెప్పుట మానిరి. వేదమంత్రార్థము సర్వజనగ్రాహ్యముఁ గావలెనని వారియూహ. అందుకని వృద్ధాప్యములో వేదముల నాంధ్రీకరించుటకు సమకట్టిరి. కాని యాప్రయత్నము కొనసాగలేదు.

పాశ్చాత్యనాగరకతానుగుణ్యముగ సంఘసంస్కరణమన్నను మతసంస్కరణమన్నను నిమ్నజాత్యుద్ధరణమన్నను వీరి కభిమానము మెండు. వీరేశలింగముగారితోను రఘుపతి వెంకటరత్నము నాయుడు గారితోను వీరికిఁ గలిగిన సాంగత్య మిందుకుఁ గారణమైయుండును. 1895 సంవత్సరమున లక్ష్మీనరసింహముగారు ప్రార్థనసమాజములోఁ జేరిరి. వీరేశలింగముగారికి వీరియెడఁగల విశ్వాసమును బట్టి వారు స్థాపించిన హిత కారిణీ సమాజములో వీరిని యావజ్జీవ సభ్యులుగ నియమించిరి. ఆ సమాజమునకు వీ రుపాధ్యక్షులుగ కూడ పనిచేసిరి.

నిమ్నజాత్యుద్ధరణమునకై వీరు పలువిధములఁ బాటుపడిరి. వారికై ప్రత్యేక మొక పాఠశాలను 1909వ సంవత్సరమున స్థాపించి 13 సంవత్సరములు నిర్విఘ్నముగ నిర్వహించిరి.

చిలకమర్తి వారికి గల దేశాభిమానము మిక్కుటము. 1907వ సంవత్సరమున ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు బిపిన్ చంద్రపాల్ గోదావరీ మండల మహాసభలో ఉపన్యసించునపుడు చిలకమర్తి వారు ఆశువుగ చెప్పిన "భరతఖండంబు చక్కని పాడియావు హిందువులు లేగదూడలై యేడ్చుచుండ తెల్లవారను గడుసరిగొల్లవారు పిదుకు చున్నారు మూతులు బిగియగట్టి" అను పద్యమానాడు ఆంధ్రదేశమున మారు మ్రోగినది.

కళాప్రపూర్ణులు, నవలారచయిత, నాటకకర్త, దేశాభిమాని, మహాకవి, సంస్కృతాంధ్ర భాషానిష్ణాతుడు ఐన లక్ష్మీనరసింహం పంతులుగారు 1946వ సంవత్సరము జూన్ 17వ తేదీన యశఃకాయులైరి. ఆంధ్రభాషకు పంతులు గారు కావించిన సేవ అజరామరము వాఙ్మయాకాశమున వారొక ధ్రువతార.

XV

స్వప్నవాసవదత్తము

పీఠిక

మహాకవినిర్మితము లయినప్రాచీన సంస్కృత గ్రంథము లనేకములు ఖిలము లగుచున్న పనిచింతించి చెదపుట్టల పాలుకాకుండ నట్టి గ్రంథముల సంరక్షింపఁ దలంచి గీర్వాణభాషాభిమానులును దయార్ద్ర హృదయ ములును నగు ఘనత వహించిన శ్రీతిరువనంతపుర మహారాజా గారు తమ యాస్థానపండితుఁడును మహాకవియు నగుగణపతిశాస్త్రుల వారిని ప్రాచీనసంస్కృత గ్రంథసంపాదన నిమిత్తమై నియోగించిరి. ఈ పండితుఁడు రాజప్రేరణముచేతను, బాషాభిమానము చేతను బహుప్రదేశ ముల కతిఁగి గ్రంథాన్వేషణము సేయుచుండఁగా నొకచోటఁ బదుమూఁడు సంస్కృతరూపకములు కల తాటియాకుల పుస్తకముల కట్ట యాయన కంటఁ బడియెను. ఆపదుమూడురూపకము ప్రజాహితజీవనము లివి:- 1. స్వప్నవాసవదత్తము, 2. ప్రతిజ్ఞాయౌగంధ రాయణము, 3. అవిమారకము, 4. పంచరాత్రము, 5. దూతఘటోత్కచము, 6. మధ్యమావ్యాయోగము, 7. కర్ణభారము, 8. దరిద్రచారుదత్తము, 9. ప్రతిమానాటకము, 10. అభిషేకనాటకము, 11. ఊరుభంగము, 12. బాలచరితము, 13. దూతవాక్యము ఈ రూపకములందుఁ దక్కిన సంస్కృ తనాటకములందు బలెఁ బ్రస్తావనలు లేవు. ప్రస్తావనకు బదులుగా నిందు స్థాపన యున్నది. ఈపదమూఁడు రూపకములలోఁ గూడ నాందీశ్లోకము లేదు. నాంద్యంతమందు సూత్రధారుఁడు ప్రవేశించు చున్నాఁడని ప్రతిరూపకమునందునున్నది. గ్రంథకర్తపేరు స్థాపనలోఁ గాని, యంకాతమందుఁ గాని లేదు. ఈ రూపకములలోఁ గొన్నిటి యందుఁ గొట్టకొనను భరతవాక్య మిటు లున్నది.

శ్లో॥ *"ఇమాం సాగరపర్యంతాం హిమవద్వింధ్యకుండలాం।*
మహీ మేకాతపత్రాంకాం రాజసింహః ప్రశాస్తు నః"॥

ఈరూపకములలో మరికొన్నిటియందు భరతవాక్య మీక్రిందివిధముగా నున్నది.

శ్లో॥ *"భవం త్వరజసో గావః పరచక్రం ప్రశామ్యతు।*
ఇమా మపి మహీం కృత్స్నాం రాజసింహః ప్రశాస్తునః॥"

ఈ భూమి నంతను మారాజసింహుఁ డేలుఁగాక యని యాశ్లోకముల ముఖ్యాభిప్రాయము. ఈ రాజసింహుండార్యావర్తము నేలిన యొకమహారాజైయుండవచ్చును. అతఁ డేదేశమును బాలించెనో, యేనగర మతనిరాజధానియో, యతఁ డేకాలమున జీవించి యుండునో నిర్ణయించుటకుఁ దగిన యాధారములు ప్రస్తుతము కానరావు. ఇది ప్రాచీన తామ్రశిలాశాసనములు శోధించి పండితులునిర్ణయింపఁ దగిన విషయము. రాజసింహుఁ డనునది యారాజునకు స్వీయనామమో, బిరుదమో చెప్పజాలము. ఈరూపకములు రచించిన కవిగాని, కవులుగాని, యారాజసింహుని యాస్థానమునందుండవచ్చును, అట్లు కానిపక్షమున నారాజును బ్రశంసించుట యసంభవము కాదా! ఈ రూపకములలో నొకట రెంటఁ దప్పఁ దక్కినయన్నిటిలో సూత్రధారుఁ డొక్కఁడే రంగస్థలము మీదికి వచ్చి యొక యాశీర్వచనశ్లోకము జదివి పాత్రసూచనము జేసి వెళ్ళిపోవును. తక్కిన సంస్కృతరూపకములలో బలె నటిగాని, పారిపార్శ్వకుఁడుగాని ప్రవేశించి సూత్రధారునితో సంభాషించుట తఱచుగా లేదు. ఈ స్థాపనలయందు సూత్రధారుఁ డొక్కఁడు మాత్రము కనఁబడుచుండును. మరియు సూత్రధారుని వచనములు రూపకములన్నిటి యందు ఇంచుమించుగా సమానముగానే యుండును. ఒక రూపకమునందున్న పద్యములు మరియొక రూపకమందు గనుపడుచుండును. కల్పనలలోఁ గూడ నచ్చటచ్చట సామ్యము కలదు. కవిత్వశైలి మిక్కిలి మనోహరమై యేకవిధమై యతిప్రాచీన మైయున్నది. పాణినీయవ్యాకరణ విరుద్ధప్రయోగము లచ్చటచ్చటఁ గలవు. ఇందు కొక చిన్ననిదర్శనముం జూపగలము. "శిర" శ్శబ్దము సకారాంతమై యుండ నీకవి దానినకారాంతముగా బ్రయోగించి

యున్నాఁడు. సూత్రధారుఁడు చదువుమంగళశ్లోకమున సామాన్యముగా నీపదమూఁడు రూపకములలోఁ గావ్యార్థసూచకముగా నారూపకమున వచ్చు ముఖ్య పాత్రముల పేర్చుదహరింపబడు చుండును. ఈ విషయ మీక్రింది యుదాహరణమును బట్టి తెలిసికొన వచ్చును.

శ్లో॥ *"ఉదయనవేందు సవర్ణా వాసవదత్తాబలౌ బలస్య త్వామ్*
పద్మావతీర్ణపూర్ణౌ వసన్తకభ్రూ భుజౌ పాతామ్॥"

ఉదయచంద్రునివలె దెల్ల నయి మద్యపానముచే విజృంభించి వసంత ఋతువుచేత మనోజ్ఞమైన పద్మాసంపర్కముచేత సంపూర్ణమయిన బలరాముని భుజద్వయము మిమ్ము రక్షించుఁగాక! యని యీశ్లోకాభి ప్రాయము. ఇది యీనాటకములోని మంగళశ్లోకము. ఇందులోఁ కథానాయకుఁ డగునుదయనుఁడు, వాని వేఁడుకచెలికాఁ డగు వసంత కుఁడు, నుదయనుని ప్రథమభార్య యగువాసవ దత్తయు, నీరూపకము లలో కథానాయిక యగుపద్మావతి, యనునలుగురపేళ్ళ నప్రస్తుతముగా సూచించి కవి కావ్యార్థసూచనం జేసియున్నాఁడు. అన్ని రూపకములలో నీవిధముగానే కావ్యార్థసూచన సేయఁబడి యున్నది. సంస్కృతనాటకము లలో గూడ మొదట కావ్యార్థసూచన సేయఁ బడియున్నది. కాని నీవిధముగా నెచ్చటను లేదు. ఏవంవిధలక్షణలక్షితము లయిననీరూపకములు రచియించినవా రెవరో తెలిసికొనుట ప్రధానవిషయము. రచించినవా రొకరా పలువురా యనువిషయము ముందు విచారింపవలయును. ఈపదు మూఁడు రూపకములలో గూఁడ బ్రస్తావనకు మారుగ స్థాపన యుండుట చేతను, మంగళశ్లోక కావ్యార్థ సూచన, లేకవిధముగా నుండుటచేతను దాదాపుగా నన్నిఁటిలో సూత్రధారుఁడే పాత్రసూచనము సేయుచుండుట చేతను, సూత్రధారుని నోటనుండి వచ్చిన వచనముల న్నింటిలోను నొక్కటిగా నుండుటచేతను భరతవాక్యము గూడ బెక్కింటిలో నేకవిధముగా నుండుటచేతను, నొకరూపకవములోని భావవములు, శ్లోకవములు తక్కినవాటిలోఁ దఱచుగాఁ గనఁబడుచుండుటచేతను శైలి యేకవిధముగా

నుండుటచేతను నీత్రయోదశరూపక ప్రణేతయు నొక్కఁడే యని నిర్ణయింపవలసి యున్నది. ఆకవి యెవ్వఁడని యనంతరజిజ్ఞాస. ఈరూపకములలో నొకటియగు స్వప్న వాసవదత్త నాటకము భాసుఁడు రచనయించె నని రాజశేఖరమహాకవి తన కవి విమర్శనములో నీక్రింది శ్లోకమునఁ జెప్పియున్నాఁడు.

"భాసనాటక చక్రేతు ఛేకైః క్షిప్తే పరీక్షితుం
స్వప్నవాసవదత్తస్య దాహ కోఽభూన్న పావకః"

ఈ శ్లోకమును బట్టి స్వప్న వాసవదత్తనాటకము భాసరచితమని స్పష్టపడుచున్నది. మహాకవి యగు బాణుడు తనహర్ష చరిత్రపీఠికలో భాస ప్రశంసకముగా నీక్రిందిశ్లోకమును జెప్పియున్నాఁడు.

"సూత్రధారకృతారం భైఃర్నాటకై ర్బహుభూమి కైః
సపతాకైర్యశో లేభే భాసో దైవకులైరివ"

సూత్రధారునిచేతఁ జేయంబడిన యారంభములు కల బహు నాటకముల చేత భాసుఁడు కీర్తిసంపాదించెనని దీనిభావము. దీనింబట్టి భాసుడనేక నాటకములు రచియించి యశస్సంపాదనము చేసె ననియు నివియెల్ల సూత్రధారునిచేతఁ జేయఁడిన యారంభములు కలవనియు దేలుచున్నది. మనకు దొరకినరూపకములన్నియు దాదాపుగా సూత్రధారకృతారంభములే. కావున నివి యన్నియు భాసనాటకము లనిచెప్పుట కాక్షేపణ ముండఁ గూడదు. ఇదియునుగాక ప్రథితయశస్కులయిన భాస సౌమిల్లకవి పుత్రాదుల నాటకము లుండఁగా వర్తమాన కాలీనుఁడగు కాళిదాసునాటక మేల ప్రయోగింపవలెనని మాళవికాగ్ని మిత్రనాటక ప్రస్తావనలో నటి సూత్రధారు నడిగినట్లున్నది. దీనింబట్టి భాసుడు నాటకప్రణేత యనియు నందుఁ గాళిదాసాదులకుఁ బూర్వమే లబ్ధప్రతిష్ఠుఁ డనియు విశద మగుచున్నది. పూర్వోదాహృత కారణములంబట్టి భాసుఁ డీనాటకము లన్నిటిని దప్పక రచియించి యుండునని నిర్ణయము సేయవచ్చును. స్థాపన లలో నతని పేరెందునకు లేదందు రేమో కవిపేరు నాటకమున నుద

హరించుట యిటీవలియాచారము గాని, ప్రాచీనాచారము కాదు. ప్రాచీను లెవరయిన భాసుని గ్రంథము లెఱుఁగుదురాయని కొందఱు శంకింప వచ్చును. అలంకార శాస్త్రప్రణేతలకెల్ల మూలపురుషుఁ డని చెప్పఁ దగిన భామహుఁడు తనకావ్యాలంకారమున చతుర్థపరిచ్ఛేదమందు భాసుని ప్రతిజ్ఞాయౌగం ధరాయణములోని గొంతభాగము విమర్శించెను. అభినవ గుప్తపాదులు నాట్యవేదివివృతి యను భారతీయవ్యాఖ్యానమున బాసమహా కవి విరచితము లయిననాటకములలోని శ్లోకములఁ గొన్నిటినుదహరించెను. అలంకార సూత్రకారుఁడగు వామనుఁడును భాసునిం బ్రామాణిక కవిగాఁగ్రహించి యాతనిశ్లోకములఁ గొన్నిటి నుదహరించెను. చాణక్యుఁడు రచియించిన యర్థశాస్త్రములో నొకానొకచోట భాసుని ప్రతిజ్ఞానాటికలోని చతుర్థాంకమందలి యీక్రిందిశ్లోకము గానఁబడుచున్నది.

శ్లో॥ *"నవంశ రావంసలిలై స్సుపూర్ణం।*
సుసంస్కృతం దర్భకృతోత్తరీయమ్।
తత్తస్యమాభూన్నరకం సగచ్ఛే।
ద్యోభర్తృపిండస్యకృ తేనయుధ్యేత్॥"

మమ్మటుఁడు మొదలగు నవీనాలంకారికులు భాసగ్రంథముల నుండి శ్లోకముల నుదహరింపక పోవుటకుఁ గారణము కలదు. నాటక రచనము నందు నిరుపమాన కౌశలముగల కాళిదాసభవభూతి ప్రముఖ మహాకవులు తలలెత్తినతరువాత వారినాటకములతో రసపుష్టి యందు కథాకల్పనమందును, భాసనాటకములు సమానములు గాకఁపోవుటచే నీతఁడు క్రమక్రమముగా జనులచేత మఱచిపోఁబడుటయు, నీతనిగ్రంథ ములు కాలక్రమమున విరళప్రచారము లగుటయు సంభవించియుండును. భాసనాటకములు కూడ మనోహరము లయినను, వాని శైలిమృదుమధుర మయ్యును ప్రౌఢిమమందు నర్థగాంభీర్యమందు నుత్తరరామచరిత్ర

శాకుంతలమునకుఁ దీసిపోవును. అయినను జదువుకొనుటకు విసువులేక యెంతో మనోహరముగా నుండును. ఈనాటకముల సంస్కృతనాటకములు యొక్క బాల్యావస్థను దెలియఁజేయు నని నాయభిప్రాయము. భాసుని కాలము నిర్ణయించుటకుఁ గూడ నిప్పటికి దగిన యేయాధారములు లేవు. కాళిదాసు మాళవికాగ్ని మిత్రమం దీతని బేర్కొనుట చేత నతనికంటెఁ బూర్వుండనుట నిర్వివాదము. కావుననీతఁడు క్రీస్తుశకమునకు బూర్వమున్న వాఁడేమోయని తోచుచున్నది. ఇదియు ముందు ముందు విచార్యము. అపూర్వ కథాగర్భితమైన స్వప్న వాసవదత్తనాటకమును జదివిన తర్వాత దానిం దెనిఁగింప వలెనని నాకుఁ గుతూహలము గలిగినది.

భాషాంతరీకరణమందలి గుణదోషవిచారణము రసజ్ఞులగు చదువరులకే విడుచుచున్నాడను.

ఆంధ్రగీర్వాణ భాషాకోవిదులును, వీరేశలింగపాఠశాలయందాంధ్రోపాధ్యాయులు నగు శ్రీవేదమూర్తులయిన బ్రహ్మశ్రీ అకుండి వ్యాసమూర్తి శాస్త్రులవారు భాషాంతరీకరణమునందు నాకు మిక్కిలి సహాయము చేసినందున వారియెడఁగృతజ్ఞుఁడ నయి వారి కనేక వందనములు సమర్పించు చున్నాఁడను.

ఇట్లు విన్నవించు బుధజనవిధేయుఁడు
చిలకమర్తి లక్ష్మీనరసింహము.

కథాసంగ్రహము

ఈ నాటకమునందలి కథ సమగ్రముగాఁ దెలియుటకై కథానాయకుఁడగు వత్సరాజుయొక్క పూర్వవృత్తాంత మించుక తెలియుట యావశ్యకము. కాన దానిని సంక్షేపముగాఁ జెప్పెదను. ఉదయనుఁ డనుపేరు గల చంద్రవంశపురాజు కౌశాంబీనగరమును రాజధానిగఁ జేసికొని వత్సదేశ మేలుచుండెను. అతఁడు మిక్కిలి చక్కనివాఁడు; సుగుణ సంపన్నుఁడు; గానవిద్యావిశారదుఁడు. ఆకాలమునందు మిక్కిలి బలాఢ్యుఁ డగు ప్రద్యోతుఁడనురాజుజ్జయినీనగరము రాజధానిగఁ జేసికొని యవంతిదేశమును బాలించుచుండెను. అతనికి మహాసేనుడనియు చండమహాసేనుఁడనియు బిరుదనామములుకలవు. ఈతనియొద్ద గొప్పసేన లుండుటచేత నితని కీబిరుదనామముకలిగెను. అతనికి వాసవదత్త యనుకూతురు కలదు. ఆమె సౌందర్యము వర్ణనాతీతము. ఆమెను వత్సరాజగునుదయనున కొసఁగి వివాహము సేయవలయునని సంకల్పించుకొని ప్రద్యోతుఁడు వత్సరాజును మాయోపాయముచేఁ దనభటులచేత బట్టించి తనకోటకుఁ దెప్పించి తనకూఁతురగువాసవదత్తకు సంగీతము సెప్పుమని యాతని కొప్పగించెను. వత్సరాజమంత్రి యగుయౌగంధి రాయణుఁడు, సేనాపతియగు రుమణ్వంతుఁడు, విదూషకుఁడగు వసంతుకుఁడు దమరాజున కేమియాపద కలుగునోయని భయపడి మారువేషములు వేసికొని యుజ్జయినికిం బోయి కోటలోఁ బ్రవేశించి రాజును సంరక్షించు చుండిరి. వత్సరాజునకు వాసవదత్తకు మనస్సులలోఁ బరస్పరానురాగము నెలకొనెను. ప్రద్యోతుఁడు వారి కిద్దఱకు వివాహము చేయవలెనని మనస్సులో సంకల్పించుకొనెను. కాని యాతనియుద్దేశ మెవరికిఁ దెలియ నందున వత్సరాజు దనయాప్తుల సహాయముచేత వాసవదత్తను లేవదీసికొని రహస్యముగా నుజ్జయినుండి పారిపోయి కౌశాంబీనగరమున కఱిగి యచ్చట నామెను వివాహముం జేసికొనెను. చండమహాసేనుఁడు తనకూఁతురు

వత్సరాజుతో వెళ్ళిపోవుట విని విచారించి వారిద్దఱచిత్తరువులు వ్రాయించి యాప్రతి కృతులకు వైభవముతో వివాహము చేసెను. అనంతరము కొంత గాలమునకు వత్సరాజు రాజ్యభ్రష్టుఁడై లావాణక మనుగ్రామమున వసియించుచుండెను. మగధరాజు చెల్లెలైన పద్మావతిని వివాహమాడిన పక్షమున వత్సరాజునకు మరల రాజ్యము ప్రాప్తించునని సిద్ధు లాదేశించినట్లు స్వామి భక్తితత్పరుఁడగుయౌ గంధరాయణుఁడు తనప్రభువున కామెను వివాహము సేయసంకల్పించెను. కాని వాసవదత్త యుండఁగా వత్సరాజు మఱొక కాంతను వివాహమాడఁడు. అందుచే నొకనాఁడు వత్సరాజు వేఁట కఱిగినప్పుడు లావాణకగ్రామము కాలిపోఁగా వాసవదత్త యందులో బడి కాలిచచ్చిపోయెననియు నామె నీవలకుం దీయుటకై నిష్ఫలం జొఱఁబడి యౌగంధ రాయణుఁడుకూడ మృతినొందెననియు లోకములో వాడుక బుట్టించి యౌగంధరాయణుఁడు వాసవదత్తను వెంటబెట్టుకొని మఱియొక చోటికిఁ బోయెను. ఇది పూర్వవృత్తాంతము.

ఈ నాటకంలోని కథాసంగ్రహం

మగధరాజకుమారి పద్మావతిని ఉదయనుడు (వత్సరాజు) వివాహమాడినట్లయితే ఆరుణి అనే పొరుగురాజుద్వారా ఆక్రమించబడిన అతని రాజ్యం తిరిగి అతనికి లభిస్తుందని జ్యోతిష్కులు చెప్పారు. కాని ప్రాణసమానంగా ప్రేమించబడే వాసవదత్త జీవించివున్నంత వరకు ఉదయనుడు మరోవివాహం చేసికొనడం జరగదని తెలిసిన మంత్రి యౌగంధరాయణుడు వాసవదత్త సహాయంతో, ఉదయనుడు వేటకేగినపుడు గ్రామం కాలిపోగా అందులో వాసవదత్త, యౌగంధరాయణుడు ఇద్దరూ కాలి మరణించారని పుకారు పుట్టిస్తాడు. తరువాత యౌగంధరాయణుడు వాసవదత్తను తనచెల్లెలని పరిచయంచేసి పద్మావతి దగ్గర ఆమెను వుంచుతాడు. ఉదయనుడు వాసవదత్త విరహంతో దుఃఖితుడయ్యి చివరకు పద్మావతిని వివాహం చేసికొనడానికి అంగీకరిస్తాడు. పద్మావతీ వత్సరాజుల వివాహం జరుగుతుంది. అయినా వత్సరాజు వాసవదత్తను మరచిపోలేదు.

ఒకదినం సముద్ర గృహంలో ఉదయనుడు నిద్రిస్తూ వుండగా వాసవదత్త అక్కడికి వచ్చి ఉదయనుణ్ణి పద్మావతి అనిభ్రమించి అతని ప్రక్కన కూర్చొంటుంది. సప్నంలో వత్సరాజు వాసవదత్తను గూర్చి పలవరిస్తాడు. వాసవదత్త తన రహస్యంబైట పడుతుందని అక్కడి నుండి వెళ్ళిపోతుంది.

తర్వాత మగధరాజు సాయంతో ఉదయనుడు రాజ్యాన్ని సంపాదిస్తాడు. ఆ సమయంలో వాసవదత్త బ్రతికివున్నదని రహస్యం బైటపడుతుంది. ఈ విధంగా నాటకం సుఖాంతంగా ముగుస్తుంది. ఇది 6 అంకాల నాటకం. వాసవదత్త వత్సరాజును స్వప్నంలో కలిసికోవడంతో దీనికి స్వప్నవాసవదత్త అనే పేరు పెట్టబడింది.

కథాసరిత్సాగరంలోని లావాణక లంబకం ఈ నాటక కథకు మూలం.

స్వప్నవాసవదత్త నాటకము
ఇందు వచ్చుపాత్రములు

పురుషులు

ఉదయనుఁడు – వత్సరాజు, కథానాయకుఁడు

యౌగంధరాయణుఁడు – వత్సరాజు మంత్రి

వసంతకుఁడు – వత్సరాజు విదూషకుఁడు.

బ్రహ్మచారి – లావాణకమున వేదముజదువుకొనుచున్న బ్రాహ్మణుఁడు

మగధరాజు కాంచుకీయుఁ డొకఁడు

చండమహాసేనుని కాంచుకీయుఁ డొకఁడు భటులిద్దఱు

స్త్రీలు

వాసవదత్త – వత్సరాజు పెద్దభార్య, ఆవంతికయను పేరుతోనుండును.

పద్మావతి – కథానాయిక, వత్సరాజు రెండవభార్య, మగధ రాజుచెల్లెలు.

తాపసి –

చేటి – పద్మావతీ దేవి పరిచారిక

మధుకరిక& పద్మినిక – పద్మావతీదేవి సఖులు

ధాత్రి – పద్మావతి దాది

విజయ – వత్సరాజు మందిరమందలి ప్రతీహారి

ధాత్రి – వాసవదత్త దాది

స్వప్న వాసవదత్తానాటకము
ప్రథమాంకము

(అంతట నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

సూత్ర -

తే॥గీ॥ *ఉదయనవ్యేందువర్ణత నొఱపు మిగిలి*
యభిన వాసవదత్త బలాఢ్య మగుచు
నావసంతకప్రమ మయి పద్మావతీర్ణ
పూర్ణ మగుసీరిదోర్ద్వయి ప్రోచు మిమ్ము.

ఆర్య మిత్రులతో నేనీలాగున విజ్ఞాపనము చేసికొనుచున్నాఁడను.

ఏమిది! నేను విజ్ఞాపనవ్యగ్రుఁడ నయి యుండఁగా నేదోశబ్దమ వినఁబడుచున్నట్లున్నది. కాని చూచెదను.

(తెరలో)

ఆర్యులారా! తొలఁగిపొండు! తొలఁగిపొండు!

సూత్ర - ఆహా! తెలిసినది.

తే॥గీ॥ *కన్యవెంట నేతెంచిన కార్యచణులు*
మగధభూపాలభృత్యులు మత్సరమున
వెడలనడచుచునున్నారు వెనుక కిప్పు
డాతపోవనమునఁ జేరు నఖిలజనుల.

(నిష్క్రమించు చున్నాఁడు.)

ఇది స్థాపన.

(అంతట నిద్దఱుభటులు ప్రవేశించు చున్నారు.)

భటులు - ఆర్యులారా! తొలఁగిపొండి! తొలఁగిపొండి!

(అప్పుడు పరివ్రాజక వేషుఁ డయినయౌగంధరాయణుఁడు, అవంతి కావేషధారిణి యగు వాసవదత్తయుఁ బ్రవేశించు చున్నారు.)

యౌగం - (చెవి యొగ్గి) ఏమిది! ఇక్కడసైతము తొలఁగిపోవలయునా?

ఎందుచేతనోకాని -

మ॥ ఫలభుక్తిన్ దనివొంది యాశ్రమములన్ వాసంబు గావించి వ
ల్కలముల్ దాలిచి యార్యులౌ జనులకేకల్గెం భయం బీగతిన్
బలియుం జంచలభాగ్యగర్వి వినయభ్రష్టుండు వీఁ డెవ్వఁడో
ఖలుఁడై నిశ్చలమౌ తపోవని, నిజాజ్ఞన్ గ్రామముం జేసెడిన్.

వాస - అయ్యా! ఈతొలఁగింపు చున్నావాఁ డెవ్వఁడు?

యౌగం - ఎవఁడో నీచుఁ డిలుగెత్తి పిలుచుచుఁ దొలఁగిపొండను చున్నాఁడు.

వాస - ఆర్య! వాఁడెవఁ డయిన నేమి? నేను గూడఁ దొలఁగి పోవలసిన దాననయితిని గదా యని విచారించు చున్న దానను.

యౌగం - పూజ్యులారా! మాఱువేసములతోనుండి తెలిసికొనుటకు వీలు లేనప్పుడు దేవతలు సైతము తిరస్కరింపఁ బడుచుందురు.

వాస - అయ్యా! ఈపరాభవమువలనఁ గలిగినంతభేదము మార్గాయాసము వల్లఁగూడఁ గలుగలేదు.

యౌగం - అమ్మా! ఇందు విచారించుట కార్యము గాదు. ఏమన? నీవిషయము పూజ్యురాల వైననీ వనుభవించి విడిచిపెట్టినదే. ఎట్లనిన -

తే॥గీ॥ తొల్లినీచిత్త మెటు లట్ల చెల్లిపోయె
భర్త జయ మొందఁ గడుసుఖంపడుదు మఱల
మహిని కాలగతులచేత మాఱు జనుల
భాగ్యపఙ్క్తియుఁ జక్రంపుపఙ్క్తి వోలె.

భటులు - తొలఁగిపొండి! తొలఁగిపొండి!

(అప్పుడు కాంచుకీయుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

కాంచు - సంభషక! వలదు. వలదు. తొలఁగి పొమ్మనఁ గూడదు. చూడు -

తే॥గీ॥ క్షోణిపతి నిందఁ బడకుండఁ జూడవలయుఁ
దగదు పురుషప్రయోగంబు తపసులయెడ
పురములందరి పరిభవంబులకు నోడి
యీమహాత్ములు వసియింతు రీవనముల.

భటులు - అయ్యా! చిత్తము.

(నిష్క్రమింతురు.)

యౌగం - ఆహా! ఈతనిబుద్ధి విజ్ఞానవంతము. బిడ్డా! కావున నీతనిదగ్గఱకుఁ బోవుదము రమ్ము.

వాస - అయ్యా! అలాగే.

యౌగం - (సమీపించి) ఓయీ! ఈయుత్సారణ మేల చేయఁబడుచున్నది?

కాంచు - ఓ తపస్వీ.

యౌగం - (తనలో) తపస్వియను పిలుపు నాకిష్టమయినదియె కాని యలవాటు లేమినది నా మనసునకు గ్రొత్తగ నున్నది.

కాంచు- ఓయీ వినుము. గురువులచేత నభిహితనామధేయుఁ డయిన మాదర్శక మహారాజాగారి చెల్లెలు పద్మావతీ దేవి పూజ్యాశ్రమముల యందు వసియించుచున్న తనతల్లియగు మహాదేవిని సందర్శింపవచ్చి, మాతృ సేవఁ జేసి, యామెయొద్ద సెలవు గైకొని మఱల రాజగృహంబునకు బోవు చున్నది. నేఁడామెయీ యాశ్రమపదమునం దుండ నభిలషించు చున్నది కావున -

మ. *సమిధల్ తీర్థజలంబులుం గుశలు పుష్పంబుల్ యథేచ్ఛంబుగా*
సమకూర్పం దగు నీతపోధనులకున్ సద్భక్తి మీరందఱున్
బ్రమదారత్నము మాన్యపాలసుత ధర్మప్రీతి యెన్నండు సం
యములం దోర్వదు ధర్మపీడ యిది వంశాచార మాయింతికిన్.

యౌగం - (తనలో) మగధరాజపుత్రి యగునా పద్మావతి యీమెయా? ఈమెయే కదా! యీమహారాజునకు దేవి యగు నని పుష్పక భద్రాదు లయినయాదేశకులు చెప్పియుండిరి.

తే॥గీ॥ గౌరవద్వేషభావముల్ కలుగు చుండు
లోన సంకల్పమున నుండి మానవులకు
క్షోణిభర్తకు దేవిగాఁ గోరుకతన
నీమెపై నాకు మది స్వత్వత మెంతొ కలిగె.

వాస - (తనలో) రాజపుత్రి యని వినుటచేత నా కామెయందు సోదరీస్నేహము పొడము చున్నది.

(అప్పుడు సపరివార యగుపద్మావతియుఁ నామెచేటియుఁ బ్రవేశించు చున్నారు.)

చేటి - రాజపుత్రీ! రమ్ము! రమ్ము! ఈయాశ్రమపదముఁ బ్రవేశింపుము.

(అప్పుడు కూర్చుండి యొకతాపసి ప్రవేశించు చున్నది.)

తాపసి - రాజపుత్రికకు స్వాగతము.

వాస - (తనలో) ఆ రాజపుత్రిక యీమెయా! ఈమెరూపము కులము నకుఁ దగియే యున్నది.

పద్మా - భగవతీ? నమస్కారము.

తాపసి - చిరంజీవినివి గమ్ము. బిడ్డా! రమ్ము! రమ్ము! తపోవనము లతిథిజనుల స్వగృహములు కదా!

పద్మా - అమ్మా! ఔనౌను! ఈ బహుమానవచనములచేత నీవు నన్ను నిజముగా ననుగ్రహించితివి.

వాస - (తనలో) ఈమెరూపము మాత్రమే కాదు. మాటయుమధురమె.

తాప - (చేటితో) కళ్యాణీ! ఈమెయా! భద్రముఖుఁడగు మగధరాజు సోదరి. ఈమె నే రాజు వరింపలేదా?

చేటి - లేకేమి! ఉజ్జయినీ నగరమందుఁ గలఁడుకదా ప్రద్యోతుఁ డను మహారాజు ఆయన తనకుమారుని కీమె నడుగు మని దూఁత నంపినాఁడు.

వాస - (తనలో) మేలు! మేలు! ఈమెనాకిప్పుడాప్తురా లయినది.

తాప - ఏమి! యీమెయాకార సౌందర్యము ఈసౌభాగ్యవతికతమున రెండు రాజకులములు శోభావంతము లగును.

పద్మా - (కంచుకితో) అయ్యా! నేనిచ్చుదానవములు గ్రహించి నన్నుగ్రహించుట కెం దెవరయిన మునిజనులు కనుపడిరా?

కాంచు - అమ్మా! నీకిష్టమయినట్లు చేయుము. ఓహో ఆశ్రమవాసులగు తపస్వులారా! మీరెల్లరు వినుఁడు. వినుండు. పూజ్యారాలయిన మగధ రాజపుత్రి విస్రంభము గలదైధర్మార్థము దానముసేయ సంకల్పించి పిలుచు చున్నది.

మ. *కలశం బెవ్వఁడు గోరు వస్త్రమెవఁ డాకాంక్షించు నెవ్వాఁడు దీ*
క్షలఁ జొచ్చెన్ గురుదక్షిణల్ సలుప సంకల్పించె నెవ్వాడు ని
ర్మలధర్మప్రియమాన్యపాలసుత యార్త్యానుగ్రహార్థం బిడం
దలఁచెం గోర్కుల, నేరికేదిహితమో దానిన్ వెసం జెప్పరే.

యౌగం - (తనలో) ఆహా! ఉపాయము కనుపడినది. ప్రకాశముగా ఓహో! నేను యాచకుఁడను.

పద్మా - అదృష్టవశమున నాతపోవనాభిగమనము సఫల మయినది.

తాపసి - ఈయాశ్రమపదము సంతుష్టతపస్విజనము. ఈ యాచకు డెవఁడో యాగంతకుఁడై యుండవచ్చును.

కాంచు - ఓయీ! యేమి కోరెదవు?

యౌగం - ఈమె నాసోదరి ప్రోషితభర్తృక. కొంతకాల మీమెను బూజ్యారాలయిన యీరాజపుత్రికయొద్ద నుంచఁదలచుకొన్నాఁడను. ఆమెను సగౌరవముగఁ బరిపాలింప వలయుననికోరు చున్నాఁడను. ఏమన-

మ. *అడుగన్ వల్వలు, కోర భోగములు, ద్రవ్యం బే నపేక్షింప, నా*
కడుపుం గూటికిఁ దాల్పు లేదుసుమి యీకాషాయచేలంబులం
గడుధర్మప్రియ యైనరాజసుతయే కాపాడఁగా జాలు నీ
యెడ నాచెల్లెలి శీలమున్, వరములింతే చాలు నే రేటికిన్

వాస - (తనలో) ఆహా! ఆర్యయౌగంధరాయణుఁడు నన్నిక్కడ దాఁపఁ దలంచు కొన్నాఁడు. అయనను సరిగా విచారింప కీతఁడేపనియుం జేయువాఁడు కాఁడు గదా!

కాంచు - అమ్మా! యీతనికోరిక మిక్కిలి కష్టసాధ్య మయినది. ఎట్లంగీకరించెదవు?

ఏమన.

తే॥ గీ॥ ధనము నిచ్చుట సుకరంబు, తపమునైన
నీయవచ్చును ప్రాణంబు లీయవచ్చు.
నన్య మేధైన నీవచ్చు నంతెకాక
న్యాసరక్షణ సేయుట యతిభరంబు

పద్మా - అయ్యో! ఎవ్వఁడేమి కోరునో దానినిచ్చెద మని మొట్టమొదటఁ జాటించి యిప్పుడు విచారించు టయుక్తము. కావున నతఁడు చెప్పునట్లు చేయుదము.

కాంచు - అమ్మా! నీవు చక్కఁగాఁ జెప్పితివి.

చేటి -నత్యవాదిని యగుమారాజపుత్రి చిరంజీవిని యగుఁగాక!

తాపసి - కల్యాణీ! చిరంజీవినివి కమ్ము.

కాంచు - అమ్మా! అట్లు చేయుదును. (సమీపించి) అయ్యా! మీ సోదరీపరిపాలనము సేయుటకు బూజ్యారా లయినమారాజపుత్రి యంగీకరించినది.

యౌగం - ఈపూజ్యారాలిచేత ననుగ్రహింపఁబడితిని. వత్సా! రాజ పుత్రియొద్ద కఱుగుము.

వాస - (తనలో) వేరుగతి లేదు కావున మందభాగ్యురాల నగునే నిప్పుడే వెళ్ళెదను.

పద్మా - మేలు! మేలు! అమ్మా నీవిప్పుడు నాదాన వైతివి.

తాపసి - ఇంతయాకార సౌందర్యము గలయీమె యే రాజమహిషి యోయయి యుండవచ్చును.

చేటి - అమ్మా మీరు చక్కఁగాఁ జెప్పితిరి. ఈమె సుఖపడినది యని నాకుఁ దోఁచు చున్నది.

యౌగం - (తనలో) అమ్మయ్య! ఇప్పటికి సగముభారము దిగిపోయినది. కార్యము మంత్రులచేత నెట్లుసమర్థింపఁబడినదో యట్లుపరిణమించినది మారాజును రాజ్య ప్రతిష్ఠితునిఁ జేసినపిదప సన్నిధానవర్తి నగునాకీరాజపుత్రి విశ్వాస పాత్రము కాఁగలదు. ఎందుచేత ననఁగా,

మ. *వలదన్నన్ నరపాలపత్ని యగుని పద్మావతీ దేవి మున్*
గలుగుం గీడట భద్రమౌ ననుచు నాకార్తాంతికుల్ సెప్ప నం
దలి విశ్వాసముచేతఁ జేసితి నిటుల్ దైవంబున్ దాఁటి, పోఁ
డలఁతిన్ గాఢపరిక్షితంబు లగుసిద్ధాగిష్ట వాక్యంబులన్
(అంతట బ్రహ్మచారి ప్రవేశించుచున్నాఁడు)

బ్రహ్మ - (పైకిచూచి) మధ్యాహ్న మయినది. నేను మిక్కిలి పరిశ్రాంతుఁడ నైతిని. నే నేప్రదేశమందు విశ్రమింతును? (తిరిగి) సమీపమునఁ దపోవన ముండవచ్చును. ఔను,-

మ. *స్థలవిశ్వాసముచేత భీతిలక స్వేచ్ఛం గ్రుమ్మరున్ లేళ్ళు, స*
త్ఫలపుష్పాదిసమృద్ధముల్ కుజతతుల్, దాక్షిణ్య సంరక్షితం
బులెయౌ నన్నియు, గోవు లెల్ల కపిలంబుల్, క్షేత్రము ల్లేవు ప్ర
కృలంగ్రమ్మెంబోగ, యాశ్రయంబెయిదియుంకన్ సందియం
బేటికిన్

ఇందుఁ బ్రవేశించెదను. (ప్రవేశించి కంచుకినిఁ జూచి) అహో? ఇతఁ డాశ్రమవిరుద్ధజనుఁడుగా నున్నాఁడు (మఱియొకవంకఁ జూచి) ఇదిగో! నిక్కడ తపస్విజన మున్నదే! నిర్దోషముగాఁ బోవచ్చును. అరే! స్త్రీజనముకూడ నున్నదే యిక్కడ.

కాంచు - స్వేచ్ఛగా రావచ్చునయ్యా! ఆశ్రమపదము సర్వజనసాధారణము గదా?

వాస - అయ్యో! అయ్యో! పరపురుషుఁడు

పద్మా - ఈమె పరపురుషదర్శనము నొల్లదు కాఁబోలును. ఔఁగాక! ఈ న్యాసమును సరిగాఁ బరిపాలింప వలయునుగదా?

కాంచు - ఓయీ! ఈ యాశ్రమమునందు మేము ముందు ప్రవేశించితిమి కావున మావలన నీ వతిథి సత్కారముఁ గ్రహింపుము.

బ్రహ్మ - (ఆచమించి) బాగు, బాగు! మార్గాయాసము తీరినది.

యౌగం - ఆర్య! మీ రెక్కడనుండి వచ్చుచున్నారు? గమ్యస్థానమేది? మీనివాస మెచట?

బ్రహ్మ - అయ్యా! వినుము రాజగృహమునుండి వచ్చు చుంటిని వత్సదేశమునందు లావాణక మనుగ్రామము కలదు. వేదాధ్యయనము నిమిత్త మక్కడ నుంటిని.
వాస - (తనలో) హా! లావాణకమా! లావాణకసంకీర్తనముచేత నా సుతాపము తిరిగి క్రొత్తదగుచున్నది.
యౌగం - విద్య పరిసమాప్త మయినదా?
బ్రహ్మ - కాలేదు.
యౌగం - విద్య సమాప్తము కాకుండ వచ్చినందువలనఁ బ్రయోజనమేమి?
బ్రహ్మ - అక్కడ నతిదారుణ మయినవ్యసనము సంప్రాప్తమయినది.
యౌగం - ఏమి వ్యసనము?
బ్రహ్మ - అచ్చట నుదయనుఁ డనురాజు వసించుచుండును.
యౌగం - పూజ్యుఁడయిన యుదయనుఁ డక్కడనున్నాఁ డనివిందుముఁ ఆయన కేమి?
బ్రహ్మ - ఆయన కవంతిరాజపుత్రి యగు వాసవదత్తయను గాఢాను రాగ యయినభార్య కలదుగదా!
యౌగం - ఉండవచ్చును తర్వాత, తర్వాత
బ్రహ్మ - తరువాత మహారాజొకనాఁడు వేఁట గరిగి యుండఁగా గ్రామము కాలిపోయెను. వాసవదత్తయు నందు దగ్ధమయ్యెను.
వాస - (తనలో) ఇది యబద్ధ మబద్ధము. మందభాగ్యురాలను నేను జీవించియే యున్నదానను.
యౌగం - తరువాత, తరువాత?
బ్రహ్మ - తరువాత వాసవదత్తాదేవిని, సంరక్షింపఁ దలఁచి యౌగంధ రాయణుఁ డనుమంత్రియు నాయగ్ని యందే చొరఁబడి కాలిపోయెను.
యౌగం - ఆమాట నిజమే తరువాత, తరువాత?
బ్రహ్మ - తరువాత రాజు వేఁటనుండి మరలి వచ్చి యావృత్తాంతము విని కళత్రామాత్య వియోగసం జనితసంతాపమున నయ్యగ్నిహోత్రమునందే పడి

ప్రాణముల విడువ సంకల్పించెను. కాని యమాత్యు లతిప్రయత్నంబున నతని వారించిరి.

వాస - (తనలో) ఎఱుఁగుదు. ఆర్యపుత్రునకు నాయందలిదయ నెఱుఁగుదును.

యౌగం - తర్వాత, తర్వాత?

బ్రహ్మ - తర్వాత రాజా పూర్వ మామెమేన ధరియించు నగలలో దగ్ధముకాఁగా మిగిలిన వానినిఁ గౌగిలించుకొని మూర్ఛపోయె.

అందఱు - హా! హా! ఎంతకష్టము.

వాస - (తనలో) ఆర్యయౌగంధ రాయణుఁ డిపుడు సఫలమనోజ్ఞుఁ డౌఁగాక! (కన్నీరు విడుచును)

చేటి - రాజపుత్రీ! ఈమె యేడ్చు చున్నది.

బద్మా - జాలిచేత దుఃఖము వచ్చియుండును.

యౌగం - ఔను. నాచెల్లెలు స్వభావముచేతనే మిక్కిలి జాలిగుండె కలది. తరువాత, తరువాత?

బ్రహ్మ - తరువాత రాజు మెల్లమెల్లఁగా మూర్ఛనుండి తెలిసెను.

పద్మా - అదృష్టవశమున బ్రతికెను. మూర్ఛ పడెనని విని నా హృదయము శూన్య మయినట్లున్నది.

యౌగం - తరువాత, తరువాత?

బ్రహ్మ - తరువాత నారాజు నేలంబొరలుటం జేసి పాంసుపాటలశరీరుడయి చివాలున లేచి "హా! వాసవదత్త! హా! యవంతి రాజపుత్రి! హా! ప్రియురాల! హా! ప్రియశిష్యురాల!" యని యేమేమో బహువిధముల విలపించెను ఇన్నిమాట లెందులకు-

చ. *అరయఁగ జక్రవాకముల యార్తియొకానొక యార్తిగాదు, స్త్రీ*
విరహము లొందు నన్యజన వేదన వేదనగాదు, వత్సభూ
వరు వగఁ జూడ, భర్త కటువంటి ప్రియంబును గూర్చునట్టి సుం
దరి యతిధన్య యానెలఁత దగ్ధత నొందియు దగ్ధ గాదుసూ.

యౌగం - అయ్యా! అటు లున్న మహారాజు నోదార్చుటకు మంత్రి యొకఁడయినఁ బ్రయత్నముఁ జేయలేదా?

బ్రహ్మ - చేయకేమి? రుమణ్వంతుఁ డనుమంత్రి యామహారాజు నోదార్చుటకు సర్వప్రయత్నములు సేయుచున్నాఁడు ఆ మంత్రిస్థితి యిట్లున్నది-

సీ. *అతిదుఃఖవశమున నవనీతలేంద్రుఁ డా*
హారంబు మానిన నతఁడు మాను
నెడలేక నృపునితో నేప్రొద్దు వగచుట
వదనంబువసివాళ్ళు వాఱి యుండెఁ
బ్రభునితో సమదుఃఖభాజనం బైయుంట
మేన సంస్కారంబుఁ బూన డెపుఁడు
పవ లంము రే యంచుఁ బాటింప కొకరీతి
కడు యత్నమున రాజుఁ గాచి యుండు

ఆ.వె. *శోకభారమునను క్షోణీశుఁ డొకవేళ*
గాలధర్మ మొందఁ గలుగునేని
నవనివిభునితోడ నారుమణ్వంతుండు
తనువుఁ దొఱఁగిపోవు దప్ప దింత.

వాస - (తనలో) అదృష్టవశమున నార్యపుత్రుఁ డిప్పుడు సురక్షితుఁడుగా నున్నాఁడు.

యౌగం - (తనలో) పాపము రుమణ్వంతుఁడు మహాభారము వహించుచున్నాఁడు గదా! ఎందువల్లనన,

తే.గీ. *అరయ నాదుభారము విశ్రమాన్వితంబు*
మేర లేదు రుమణ్వంతు భారమునకు
నవనిపతి యెవ్వనియధీనుఁ డగుచునుండు
నతనిపాటులు వర్ణింప నలవి కాదు.

(ప్ర)అయ్యా? తరువాతనేమి? రాజుపర్యవస్థాపితుఁడయ్యెనా?

బ్రహ్మ - ఇప్పు డెట్లున్నాఁడో నేనెఱుఁగను. కాని యారాజు విరహవేదనాతి శయమున "ఆమెయు నేను నిక్కడనవ్వితిమి ఇక్కడ కథలు చెప్పుకొంటిమి. ఇక్కడ నిరువురము కూర్చుంటిమి. ఇక్కడ నామె ప్రణయకోపము వహించినది". యని పరిపరి విధముల విలపించు చుండ, మంత్రు లాతనిం దగుప్రయత్నంబుల నాగ్రామమునుండి యెట కేనిం గొనిపోయిరి. రాజు వెడలి పోవుటయు గ్రామము నిశాకరనక్షత్రములు లేని యాకాశము వలె శోభావిహీన మయ్యె. అందువలన నేను నక్కడనుండి లేచి వచ్చితిని.

తాప - ఆ గ్రామమునకు నూతనముగా వెళ్ళిన యీ బ్రహ్మవారికూడనిట్లు ప్రశంసచేయుటచే నారాజు మిక్కిలి గుణవంతుడుగదా!

చేటి - రాజపుత్రీ! మరల నేస్త్రీ యా రాజు పాణిగ్రహణము చేయునో? కదా?

పద్మా - నేను నాహృదయములో నిదే యనుకొనుచున్నాను.

బ్రహ్మ - నేను వెళ్ళెదను సెలవిండు.

యౌగం, కాంచు - వెళ్ళుము కార్యసిద్ధియగుఁగాక!

బ్రహ్మ - తథాస్తు (నిష్క్రమించును)

యౌగం - ఈ పూజ్యురాలి యనుజ్ఞ వడసి నేనును వెళ్ళఁగోరు చున్నాడను.

కాంచు - అమ్మా? నీయనుజ్ఞవడసి యీయన పోఁదలఁచుకొన్నాడు.

పద్మా - సోదరవియోగమున క్షేమి వగవదుగద.

యౌగం - సాధుజనహస్తగత యగుటచే నీమె వగవదు. (కంచుకిని జూచి) ఓయీ! నేను వెళ్ళుచున్నాఁడను.

కాంచు - వెళ్ళుము. పునర్దర్శన మగుఁగాక!

యౌగం - తథాస్తు. (నిష్క్రమించుచున్నాడు)

కాంచు - లోపలికి వెళ్ళవలసిన సమయమయినది.

పద్మా - భగవతీ! నమస్కారము.

తాపసి - బిడ్డా? అనురూపవరునిం బడయుము!

వాస - అమ్మా! సెలవిమ్ము వెళ్లెదను.

తాపసి - అచిరకాలములో నీవు భర్తను గలిసికొమ్ము.

వాస - భగవతీ! అనుగ్రహింపఁబడితిని.

కాంచు - అమ్మా? రండు. ఇటు ఇటు. ఇప్పుడు సాయంకాలమయినది.

 మ. *పులుగుల్ వేఁగులాయముల్, మునిజనంబుల్తోయముం జొచ్చిరు*
జ్జ్వలుఁడై వహ్ని వెలింగె నాశ్రమమునన్ వ్యాపించెధూమంబు మి
క్కిలి దూరంబుననుండి భ్రష్టుఁడయి సంక్షేపించి యాత్మీయర
శ్మలఁ దేరి న్మరలించి యస్తశిఖరంబుం జొచ్చుఁ బ్రొద్దల్లనన్.

(అందఱు నిష్క్రమింతురు)

ఇది ప్రథమాంకము.

స్వప్న వాసవదత్తనాటకము
ద్వితీయాంకము

(అప్పుడు చేటి ప్రవేశించు చున్నది.)

చేటి - కుంజరికా! కుంజరికా! ఎక్కడ భర్తృదారిక! పద్మావతి యెక్కడ? ఏమనియెదవు? ఆ రాజపుత్రి మాధవీలతా మండపపార్శ్వమున బంతి యాడుచున్నదనియా! అట్లయిన భర్తృదారిక దగ్గఱకుఁ బోయెదను. ఓహో! ఉత్కృత కర్ణచూలికంబు, వ్యాయామ సంజనితస్వేదబిందువిచిత్రితంబు స్పృశ్యమానరమణీయ దర్శనంబు నగుకందుకంబు నాడుచు నారాజపుత్రి యీ మార్గముననే వచ్చు చున్నది. సమీపమునకు బోయెదను. (నిష్క్రమించుచున్నది.)

ఇది ప్రవేశకము.

(అప్పుడు బంతియాడుచు సపరివార యగుపద్మావతియు నావంతికా వేషధారణి యగు వాసవదత్తయుఁ బ్రవేశించుచున్నారు.)

వాస - సఖి? ఇదిగో నీబంతి.

పద్మా - అమ్మా! ఇప్పటి కీయాట చాలును.

వాస - సఖి! ఎంతోసేపు బంతి యాడుటచే నీచేతు లెఱ్ఱఁబడి యెవరి చేతులవలెనో యున్నవి. రాజపుత్రీ! ఆఁడుకొనుమాడు కొనుము. కన్యాభావ రమణీయ మయినయీకాల మాటల చేతనే వెళ్ళఁబుచ్చఁదగినది.

పద్మా - ఏమమ్మా! నన్నెగతాళి చేయఁ దలఁచుచున్నావా?

వాస - సఖీ! లేదు లేదు ఈదినమున నీవు కడుంగడు శోభిల్లు చున్నదానవు సమీపమందుండి నీవరముఖమును నేను సంతోషముతోఁజూచున్నాను.

పద్మా - చాలు! చాలు! నన్నెగతాళి చేయక యావలికి వెళ్ళు.

వాస - మారాజపుత్రి మహాసేనునిభార్యకు ముద్దులకోడ లగునఁట!

పద్మా - ఆమహాసేనుఁ డెవఁడు?

వాస - ఉజ్జయినిలోఁ బ్రద్యోతుఁడనుమహారాజా కలఁడు అయనకు మహాసేనుఁ డనునదిబలపరిణామ నిర్వృత్తమగు నామధేయము.
చేటి - మారాజపుత్రి కాసంబంధ మిష్టము లేదు.
వాస - అట్లయిన నేసంబంధ మిచ్ఛగించును?
చేటి - కలఁడుగదా! ఉదయనుఁ డనువత్సరాజా. ఆయన గుణము లీరాజపుత్రి కిష్టములు.
వాస - (తనలో) ఆర్యపుత్రునే భర్తఁగాఁ బడయ నభిలషించుచున్నది.
(ప్రకాశముగా) ఏమికారణముచేత?
చేటి - దయాళువని.
వాస - సరి, సరి! ఈమె కేమో పిచ్చి యెత్తినట్లున్నది.
చేటి - ఆరాజా కురూపుఁడా? ఏమి?
వాస - కాఁడు, కాఁడు. దర్శనీయుఁడే.
పద్మా - అమ్మా! నీ పెట్లెఱుఁగుదువు!
వాస - (తనలో) అయ్యో! ఆర్యపుత్రపక్ష పాతమున నేను సముదాచార మతిక్రమించితిని. ఇప్పు డేమి చేయుదును! ఆ! తెలిసినది.
(ప్రకాశముగా) సఖీ! ఉజ్జయనీజను లాలాగునఁ జెప్పుకొనఁగా వినియుంటిని.
పద్మా - ఔను! ఉజ్జయినీజనుల కాయన దుర్లభుఁడు కాఁడు సౌభాగ్యము సర్వజనమనోభిరామము కదా.
(అప్పుడు దాది ప్రవేశించుచున్నది.)
దాది - భర్తృదారికా! జయము! జయము? నిన్నిచ్చి వేసినారమ్మా!
వాస - ఎవరకి?
దాది - వత్సరా జయినయుదయనునకు.
వాస - ఆరాజానకుఁ గుశలమా?
దాది - కుశలమే కాదు. ఆయన యిక్కడకు దయచేసినారు భర్తృదారికను జేపట్ట సిద్ధముగ నున్నారు.

వాస - ఆత్మాహితము గదా?

దాది - ఇం దేమియత్మాహిత మున్నది?

వాస - ఏమియును లేదు. ప్రథమభార్యనిమిత్త మావిధముగా సంతాపించి యింతలోనె యుదాసీనుఁ డయినాఁడుగదా యని యట్లంటిని?

దాది - అమ్మా! మహాపురుషహృదయము లాగమప్రధానములు, సులభపర్యవ స్థానములు కదా?

వాస - అమ్మా! అయన మీరాజపుత్రిని స్వయముగ సేవరించినారా!

దాది - లేదు? లేదు. అన్యప్రయోజంబున పత్సరా జిక్కడకు రాఁగా నాతని యభిజన విజ్ఞాన వయోరూపంబులం జూచి మనమహారాజుగారే స్వయముగా నీమె నాయనకు నిచ్చిరి.

వాస - (తనలో) అట్లయిన నీవిషయము నందార్యపుత్రిదోషములేదు.

(అప్పుడు మఱియొక చేటి ప్రవేశించుచున్నది)

రెండవచేటి - అమ్మా! త్వరఁపడు త్వరఁపడు. ఈదినముననే శుభముహూర్తము కలఁదట! కాబట్టి కాళ్యాణమహోత్సవ మీ నాఁడే జరుపఁదగు నని రాజపత్ని యానతిచ్చు చున్నది.

వాస - (తనలో) ఈకార్యము త్వరపెట్టఁబడిన కొలఁది నాహృదయ మంధీభూత మగుచున్నది.

దాది - భర్తృదారికా! రమ్ము.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

స్వప్న వాసవదత్తనాటకము

తృతీయాంకము.

(అప్పుడు చింతించుచు వాసవదత్త ప్రవేశించుచున్నది)

వాస - పద్మావతిని వివాహామోదసంకుల మగునంతఃపురచతుశ్శాలలోవిడిచి నే నీప్రమదవనమునకు వచ్చితిని. ఇప్పుడు నాభాగధేయనిర్వృత్త మగు ధుఃఖము నపనయించుకొని యెదను అహో! ఎంతయహితము భర్తగారు గూడఁ బరాధీనులయిరికదా! ఇక్కడ గూర్చుండెదను. చక్రవాకి ధన్యు రాలు పతివిరహము గలిగినప్పు డది జీవింపదు. నేను బ్రాణములను విడువఁ జాలనయితిని గదా! ఆర్యపుత్రు నెన్నఁటికయినఁ జూడకపోదునా యనునాసతో మందభాగ్యురాల నయి జీవించుచుంటిని.

(అప్పుడు పుష్పములను బట్టుకొని చేటి ప్రవేశించుచున్నది.)

చేటి - పూజ్యురాలయిన యావంతిక యెందరిగినది చెపుమా! అమ్మో! చింతా శూన్య హృదయ యయి నీహారప్రతిహత యగుచంద్రలేఖవలె సమండిత భద్రకం బగు వేషము ధరియించి ప్రియంగు శిలాపట్టకముపయిఁ గూరు చున్నది. దగ్గఱకుఁ బోయెదను (సమీపించి) ఆవంతికా! ఎంత సేపటినుండి నిన్ను వెదకుచుంటినమ్మా!

వాస - ఎందునకు?

చేటి - సత్కులప్రసూతయు, దయాశాలినియు, నిపుణయు, గావున నీ కౌతుక మాలికఁ బూజ్యురాలయిన యావంతిక గ్రుచ్చఁదగు నని మహారాజపత్ని సెలవిచ్చినది.

వాస - ఎవరికొఱకు దీనిని గ్రుచ్చవలయును?

చేటి - మహారాజపుత్రికొఱకు.

వాస - (తనలో) ఇదియు నేనే చేయవలసివచ్చెఁగా! అహో! దేవతలు నిర్దయులుగదా!

చేటి - అమ్మా! ఇప్పుడు వేఱుచింతఁ బెట్టుకొనక శీఘ్రముగా దండ గ్రుచ్చుము. అల్లుడుఁగారు మణిభూమియందు మంగళస్నానము చేయు చున్నారు.

వాస - (తనలో) అహో! అన్యవిషయమును జింతించుకొనుటకయిన నాకు వీలు లేదుకదా! (ప్రకాశముగా) సఖీ! అల్లుఁడు గారిని జూచితివా?

చేటి - ఆహా! రాజపుత్రికయందలి స్నేహముచేతను నాకుఁ బొడమిన కుతూహలము చేతను జూచితిని.

వాస - అల్లుఁడుగా రెట్లున్నారు?

చేటి - అమ్మా! చెప్పుచున్నాను విను? అటువంటివాని నిదివఱకెన్నడుఁ జూడలేదు.

వాస - సఖీ! చెప్పు. చెప్పు. అంతదర్శనీయుఁడా?

చేటి - అడుగనేల! శరచాప విహీనుఁ డయిన సాక్షాన్మన్మథుఁడే.

వాస - ఇంతటితోఁ గట్టిపెట్టు.

చేటి - ఎందునకునన్ను వారించుచున్నావు?

వాస - పరపురుష సంకీర్తనము వినఁగూడదు.

చేటి - అటులయిన దండ శీఘ్రముగాఁ గ్రుచ్చుము.

వాస - (తనలో) మందభాగ్యురాల నగునేను గ్రుచ్చవలసినదే. (ప్రకాశ ముగా) సఖీ? పూవులిమ్ము. గ్రుచ్చెదను. (పూవులు పుచ్చుకొని చేతికేదో తగులగాఁ విడిచిపెట్టి చూచి) ఇది యేదయిన నోషధియా యేమి?

చేటి - ఔను, మంగళప్రద మయిన యోషధి.

వాస - (తనలో) ఇది సర్వవిధముల గ్రుచ్చదగినదె! ఏలయననిది పద్మావతికిని, నాకును సౌభాగ్యప్రదము. (ప్రకాశముగా) ఈయోషధి పేరేమమ్మా?

చేటి - దీనిపేరు సపత్నీ మర్దనము.

వాస - ఇది గ్రుచ్చనక్కరలేదు.

చేటి - ఎందువల్ల?

వాస - ఆయన ప్రథమ భార్యమృతి నొందినది కావున, గ్రుచ్చుట నిష్ప్రయోజనము.

(మఱియొక చేటి ప్రవేశించును)

రెండవచేటి – అమ్మా! త్వరఁపడు. త్వరపడు. అల్లుఁడు గారు పుణ్యస్త్రీలతోడ నభ్యంతర చతుశ్శాలం బ్రవేశించుచున్నారు.

వాస – ఇదిగోనమ్మా! తీసికో.

చేటి – సఖీ! నీవు వస్త్రమును దీసికొనిరా! నేను వెళ్ళుచున్నాను.

(ఇద్దరుచేటులునిష్క్రమించుచున్నారు.)

వాస – అదివెళ్ళినది. అహో! యత్యాహితము. ఆర్యపుత్త్రుఁడు గూడఁ బరాధీనుఁ డగుచున్నాఁడుగదా! నిద్రవచ్చిన పక్షమునఁ బండుకొని కొంతసేపు దుఃఖమును బోగొట్టుకొందును గదా!

(నిష్క్రమించుచున్నది.)

***

స్వప్న వాసవదత్తనాటకము

చతుర్థాంకము.

(అప్పుడు విదూషకుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

విదూ - (సంతోషముతో) అదృష్ట వశమున మహనీయుఁడయిన వత్సరాజుయొక్క యభిప్రేతవివాహమంగళరమణీయ మగు కాలము జూచుభాగ్యము లభించినది. ఆవిధముగా మహాపద యనుసుడి గుండము లోఁబడి మునిఁగి మరల దేలి యింతవార మగుదు మని యెవఁడను కొనెను. ఇప్పుడు నాయునికి మేడలమీద. స్నాన మంతఃపురదీర్ఘి కల యందు. భోజనము మిక్కిలి మధురములయి సుకుమారము లయిన మోదకములు ఖాద్యములు. వేయేల! నేనిప్పు డప్సరసలు లేనిస్వర్గలోక మందు హాయిగా నున్నాడను. కాని నాకొక గొప్పబాధ సంభవించినది. తిన్నతిండి నాకు సరిగా జీర్ణముకాదు. తెల్లనిదుప్పటలు పఱచిన మెత్తని పానుపుల మీఁద బండుకొని నను నిద్ర సరిగాఁబట్టదు. నాకు గర్భములో మహావాతము ప్రవేశించినట్లు తోఁచు చున్నది. అయ్యో! ఈపాడు రోగము చేత చలిదికూఁడు దినుటకు వీలులేక నాసౌఖ్యము చట్టుబండ లయిపోయి నది గదా!

(అప్పుడు చేటి ప్రవేశించు చున్నది.)

చేటి - ఆర్యవసంతకుఁ డెక్కడకు వెళ్ళెను జెపుమా! (కొంచెము నడచి) ఇదుగో! ఆర్యవసంతకుడు. వసంతకా! ఎంతసేపటి నుండి నిన్ను వెదకుచుంటి నయ్యా?

విదూ - (చూచి) కళ్యాణీ! ఎందునకు నన్ను వెదకుచుంటివి?

చేటి - అల్లుడు గారు స్నానము చేసిరాయని నిన్నడిగి రమ్మనిరాజ పత్ని చెప్పినది.

విదూ - ఎందున కిట్లడుగు చుంటివి?

చేటి – మఱే మున్నది! సుమనో వర్ణకముఁదెచ్చి యీవలయునని.
విదూ – ఆయన స్నానముచేసినారు. నీవు సర్వమును దీసికొనిరా? భోజనము మాత్రము వలదు.
చేటి – ఎందుచేత భోజనము తేవల దనుచున్నావు?
విదూ – నిర్భాఁగ్యుడనగునాకు నజీర్ణవ్యాధి ప్రవేశించినది. కోకిల గ్రుడ్లు తిరిగినట్లు నాకడుపులో వికారపెట్టి త్రిప్పుచుండును.
చేటి – కడుపుమాన మెఱుఁగక తెగఁ దిన్నందు కంతే కావలెను.
విదూ – సరేపో? ఇంతలో నేనును మారాజాగారిదగ్గకుఁ బోయెదను.

(ఇద్దఱు నిష్క్రమించుచున్నారు.)

ఇది ప్రవేశకము.

(అప్పుడు సపరివారయగు పద్మావతియు, అవంతికావేష ధారిణియగు వాసవదత్తయుఁ బ్రవేశించుచున్నారు.)

చేటి – భర్తృదారికా! ప్రమదవనమున కెందునకు వచ్చితివమ్మా?
పద్మా – సఖీ? నీవుఁ బెంచిన నల్లవావిలిచెట్లు పుష్పించినవో లేవో చూడవల యునని.
చేటి – రాజపుత్రీ? అవి పూచినవి. నడుమ నడుమఁ బగడముల గ్రుచ్చిన ముత్యాల హారములవలెఁ బుష్పములచేత మనోజ్ఞములయి యున్నవి.
పద్మా – సఖీ! అట్లయిన నేలజాగు చేసెదవు!
చేటి – భర్తృదారికా! ఈలోపున నీవాఱాతిపలక మీఁద క్షణమాత్రము కూర్చుండుము. ఇంతలో నేను బూవులు గోసితెచ్చెదను.
పద్మా – అమ్మా! అక్కడఁ గూర్చుండుదమా?
వాస – అట్లే చేయుదము.

(ఇద్దఱు కూర్చుండుదురు.)

చేటి – (పూవులుకోసి) రాజపుత్రి! చూడు. చూడు! నాదోసిలిమణి శిలపలకలతో వలెనే శేఫాలికా పుష్పములతో నిండియున్నది.

పద్మా - అహో! ఏమి యీ పుష్పముల విచిత్రత! అమ్మా! చూడు! చూడు!

వాస - అహో! యీపుష్పము లెంతదర్శనీయము లయి యున్నవి.

చేటి - భర్తృదారికా! మరలకొన్ని పుష్పములు కోయుదునా?

పద్మా - సఖీ! వలదు. మరలఁగోయవలదు.

వాస - సఖీ ఎందుచేత వలదనుచున్నావు?

పద్మా - భర్తగారిక్కడకు వచ్చి యీపుష్పసమృద్ధినిఁ జూచి వృక్షముల గౌరవింతురు.

వాస - సఖీ! భర్తనీయెడ బ్రియుఁడయి యున్నాఁడా?

పద్మా - అమ్మా! అది నేనెఱుఁగను గాని యాయనను విడిచియొక నిముస మయిన నుండజాలను.

వాస - (తనలో) నేనతిదుష్కరమును జేయుచున్న దానను గదా! ఈమెయు నిట్లే తలంచు చున్నది.

చేటి - నాభర్త నాయెడఁ బ్రియుఁడే యని భర్తృదారిక తలంచుట మిక్కిలి మంచిదికదా!

పద్మా - నాకొక సందేహమున్నది.

వాస - అదేది?

పద్మా - భర్తగారు నాయెడ నెట్లున్నారో, పూర్వము వాసవదత్త యెడఁగూడ నట్లే యుండిరా?

వాస - ఇంతకంటె నెక్కువగా నుండిరి.

పద్మా - నీవెట్లెఱుంగుదువు?

వాస - (తనలో) అయ్యో! భర్తృ పక్షపాతముచేత నేను సముదాచార మతిక్రమించితిని ఇప్పు డీలాగునఁ జెప్పెదను (ప్రకాశముగా) స్నేహమల్ప మయిన యెడల వాసవదత్తను గూర్చి యట్లేల విలపించు.

పద్మా - కావచ్చును.

చేటి - భర్తృదారికా! "నాకుఁగూడ వీణనేర్పుఁ" డని భర్తను మెల్లఁగా నడుగవమ్మా?

పద్మా - అడిగితిని.

వాస - అందున కాయన యేమనిరి?

పద్మా - మాటాడక కొంచెమునిట్టూర్పు విడిచి యూరకుండెను.

వాస - అందునకుఁ గారణ మేమయియుండు నని నీ వూహించుచున్నావు?

పద్మా - పూజ్యా రాలయిన వాసదత్తాదేవి గుణములు జ్ఞప్తికిరాఁగా దుఃఖా విష్టుడయి నాయెదుట వగచుట బాగుగ నుండదని యెట్టిటో దుఃఖము నాపుకొని మాటలాడలేక యూరకుండెనని నే నూహించు చున్నాను.

వాస - (తనలో) ఇదినిజమయిన యెడల నేను మిక్కిలి ధన్యురాలను

(అప్పుడు వత్సరాజును విదూషకుఁడును బ్రవేశించుచున్నారు.)

విదూ - ఇహిహి! ఎవరో మంకెనపూవులు గోయగా నవి పలుచ పలుచగా నిచ్చుట నచ్చటఁ బడియుండుటచే నీయుద్యానవన మెంతరమణీయముగా నున్నదో! నీవిటురా! మిత్రుఁడా!

రాజు - మిత్రుఁడా! వసంతకుఁడ! ఇదిగో! ఇదిగో! వచ్చుచున్నాను.

మ. *మునునే నుజ్జయినీపురంబరిగి రాట్పుత్రిన్ విలోకించి యొ*
క్క నవావస్థను జెంద నై దలుఁగులంగాముండునన్ గ్రుమ్మె యిం
కనుముల్కుల్ హృదినాటియున్న వపుడేకాదేచె వేమాఱుకా
ముని వైదమ్ములె యెట్టు లారవ శరంబుం జిమ్మె వాఁడిచ్చుటన్

విదూ - పూజ్యారాలయిన పద్మావతి యెక్కడికి వెళ్ళినదో! లతా మండపమునకు వెళ్ళియుండవచ్చును. లేదా, వేగినపువ్వులతో నిండి పులికలాసము పఱచిన తెఱంగున నలరు పర్వత తిలకమను రాతి పలకఁ మీదికయిన నరిగియుండ వచ్చును కాదేని, యధిక కటుకగంధ మగునేఁడా కులయ నంటుల తోటలోని కయినఁ జనియుండవచ్చు. అదియుంగాని పక్షమున మృగములయుఁ బక్షులయుఁ జిత్తరవులతో నిండినదారు పర్వతమున కరిగియుండును. (పైకిఁజూచి) హీ, హీ, హీ, హీ! శరత్కాలనిర్మల మయిన యంతరిక్షమునఁ బ్రసారితబలదేవ బాహువట్లు దర్శనీయమయి సారస పక్షుల పంక్తి యరుగుచున్నది. చూడు.

రాజా - మిత్రుఁడా! దానిం జూచుచున్నాఁడను.

సీ. *సూటిగా నిడుదయై మూపట్టు నొకమారు*
పలుచనై యొకమారు పరిధవిల్లు
నిమ్నోన్నతం బయి నెగడు వేరొకమారు
గుంపుగా నొకమారు గూడియుండు
మఱలుచో సప్తర్షిమండలి కైవడి
యెగుడును దిగుడునై యెసఁగుచుండుఁ
గుప్పసం బూడ్చిన సప్పంబుకడునట్లు
నిర్మలం బైనట్టి నింగి నిపుడు

రెండు పాయలుగా గర్తిరించునట్టి
విమల రేఖనా నొప్పు నీవిహగపంక్తి
మనుజనేత్రైక పర్యాయమాణ మగుచు
గగనలక్ష్మికి నొక యలంకార మగుచు.

చేటి - రాజపుత్రీ! తెల్లగలువపూలదండవలె స్వచ్ఛమయి యాకసంబునఁ బాఱుచున్న యాబెగ్గురుపులుంగుల బారుచూడవమ్మా ఎంతసుందరముగా నున్నదో. (ఇటునటు చూచి) అమ్మో! రాజగారు!

బద్మా - సఖీ! ఔను ఆర్యపుత్రుఁడే! అమ్మా! నీకారణమున నే నిప్పుడార్యపుత్ర దర్శనమును మానుచున్న దానను. అందుచేత నిప్పుడు మాధవీ మండప మును బ్రవేశింతము రమ్ము.

వాస - అట్లు చేయుదము.

(అట్లు చేయుచున్నారు.)

విదూ - పూజ్యురాలయినపద్మావతి యిక్కడకు వచ్చి వెళ్ళియుండ వచ్చును.

రాజా - నీ వెట్లెఱుఁగుదువు?

విదూ - ఎట్లెఱిఁగితినా? పూవులు కోసివేయఁబడిన యీ శేఫాలికా గుచ్ఛములం జూడుము.

రాజు - ఓహో! వసంతకా! ఏమి యీపుష్పములవైచిత్ర్యము!

వాస - (తనలో) వసంతకుని పేరు వినుటచేత నేను మఱల నుజ్జయినీ పురములో నున్నట్లు తలఁచుకొనుచుంటిని.

రాజు - వసంతకా? ఈ రాతిపలక మీఁదనే కూర్చుండి పద్మావతి రాక కెదురు చూతము.

విదూ - ఆహా! ఆలాగే చేయుదము. కాని, ఈశరత్కాలపు టెండ మిక్కిలి తీక్ష్ణమయి సహింప శక్యము గాకున్నది. కాఁబట్టి యామాధవీ మండపముఁ బ్రవేశింతము రమ్ము.

రాజు - మంచిది ముందు నడువుము.

విదూ - అట్లేయగుఁగాక!

(ఇద్దఱు నడుచుచున్నారు)

పద్మా - ఆర్యవసంతకుఁడు తనయిష్టముపచ్చినట్లు గడబిడఁ జేయఁ దలఁచుకొన్నాడు. ఇప్పు డేమి చేయుదము?

చేటి - భర్తృదారికా! తుమ్మెదలతో నిండి వ్రేలాడుచున్న యీతీఁగను గదిపి రాజుగారిని రాకుండఁ జేసెదను.

పద్మా - అట్లు చేయుము.

(చేటి యట్లు చేయుచున్నది.)

విదూ - హా! చచ్చితిఁ జచ్చితి! మిత్రుఁడా! నీ వక్కడనుండు. రాకు. రాకు.

రాజు - ఎందుచేత?

విదూ - ఈ తుమ్మెదతొత్తుకొడుకులు నన్ను బాధపెట్టు చున్నవి.

రాజు - భయము లేదు. భయము లేదు. తుమ్మెదలబాధ నివారించుకోవచ్చును. చూడు -

మ. *అలరుం దేనియఁ గ్రోలి మత్తుఁగొని యవ్యక్తధ్వనుల్ సేయు తేఁ*
టులఁ గుచ్చుం బిగియాఱ గొఁగటను నాడుందుమ్మెదల్ గూరిమిన్
జెలికాఁడా! మన కాలిచప్పు డయినన్ భీతిల్లి యీ తేంట్లు నా
వలెఁ గాంతావిరహార్తిఁ గుందు మన మా వంకన్ జనన్ వల్దిఁకన్.

అందుచేత మన మిక్కడనే గూర్చుందము.

విదూ – అట్లే చేయుదము.

(ఇద్దఱు కూర్చుందురు)

పద్మా – అమ్మయ్య! అదృష్టవశమున భర్తగా రిటురాక యక్కడనే కూర్చున్నారు.

వాస – (తనలో) భాగ్యవశమున భర్తగా రెప్పటి దార్ఢ్యముతోనే యున్నారు.

చేటి – భర్తృదారికా! మన మిక్కడ బంధింపఁ బడినారము. అమ్మాయిదేమి? అవంతిక కన్నీరు విడుచుచున్నది.

వాస – అమ్మా! యిది తుమ్మెదల దుండగమువలన వచ్చినది. అవి యెగు ఱుటవలన తెల్లుపుప్పొడి నాకంటఁ బడఁ గన్నుల నీరు కాఱు చున్నది.

పద్మా – ఔను.

విదూ – అయ్యా! ఈ ప్రమదవన మిప్పుడు నిర్జన మయియున్నది. ఒక్కప్రశ్న నిన్నడుగవలెనని యున్నది. అడుగుదునా?

రాజా – యథేచ్ఛముగా నడుగవచ్చును.

విదూ – ఎవర్తెనీ కెక్కువప్రియురాలు? అప్పటివాసవదత్తా! ఇప్పటి పద్మావతియా?

రాజా – నీవు నన్నిప్పుడు బహుమాన తారతమ్య మడిగి గొప్పచిక్కులోఁ బెట్టఁదలఁచు కొంటివా! యేమి?

పద్మా – సఖీ! వసంతకుఁడు భర్తగారి నెటువంటి చిక్కులోఁ బెట్టినాఁడే?

వాస – (తనలో) నే నెంతయు మందభాగ్యురాలను.

విదూ – స్వేచ్ఛగా నిర్భయముఁగా జెప్పవయ్యా! ఒకర్తు మృతి నొందినది రెండవయామె యిక్కడ లేదు.

రాజా – నీవు వడవడ వాఁగుచుంటివి. కాని చెప్పుటకు నాకు నోరు రాదు.

పద్మా – భర్తగారు చెప్పఁగల ధంతే!

విదూ – నే నెవరికి జెప్పనని యేయొట్టుపెట్టుకోమంటే ఆ యొట్టు పెట్టుకొందును. ఇదిగో! నానాలుక కఱచుకొందును.

రాజు - మిత్రుఁడా! చెప్పుట కుత్సాహము లేదు.

పద్మా - అహో! ఏమి యితనిపురోభాగిత ఇంతమాత్ర మాయన హృదయ మయినఁ దెలిసికొనలేఁడేమి?

విదూ - ఏమి! నాకుఁ జెప్పవా? నాకుత్తరము చెప్పకుండ నీజాతి పలకనుండి యొక్కయడుగయిన నిన్నుఁ గదలనీయను జాగ్రత్త నీ విక్కడ బంధింపఁ బడితివి.

రాజు - బలాత్కారమున? జెప్పించెదవా! యేమి?

విదూ - ఔను. బలాత్కారముననే చెప్పించెదను.

రాజు - అట్లయిన నెట్లు చెప్పించెదవో చూతములే.

విదూ - దయ యుంచవయ్యా! దయయుంచు. కోపపడకు యథార్థస్థితి చెప్ప వని చనువుచేత బలవంతమునఁ జెప్పించెద నంటిని.

రాజు - చెప్పక గతిలేదు. విను -

గీ. *లలితరూపవిలాసశీలములచేత*
మెలఁత పద్మావతీ దేవి మిగులఁగూర్చు
నైన వాసవదత్తతో నైక్య మొందు
హృదయమును జాఱఁగొనఁజాల దింతవఱకు.

వాస - (తనలో) మేలు! మేలు! నాపడినదుఃఖమునకు నేఁటికిఁ బ్రతిఫలము పుట్టినది. అజ్ఞాతవాసమయిన నిప్పు డెంతో యూఱట గలుగుచున్నది.

చేటి - భర్తృదారికా! నీభర్త నిర్దయుఁడు సుమీ!

పద్మా - సఖీ! వలదు. వలదు. అట్లనఁబోకుము. భర్తగా రిప్పుడు సయితము పూజ్యురాలయిన వాసవదత్తా దేవిగుణములఁ బ్రశంసించు చుండుటచేత సదయులే.

వాస - కల్యాణీ! నీసత్కులప్రసూనతకుఁ దగినట్లు పలికితివి.

రాజు - నేను జెప్పితినిగదా! నీ విప్పుడు చెప్పుము. నీ కిద్దఱిలో నెవరిమీఁద నెక్కువ యిష్టము అప్పుడు వాసవదత్తమీఁదనా? ఇపుడు పద్మావతి మీఁదనా?

పద్మా - భర్తగారుకూడ వసంతుఁడై నాఁడే?

విదూ - నామాట యెందునకు? ఆమహాదేవు లిద్దఱిమీఁద నా కిష్టమి.

రాజు - మూర్ఖుఁడా? అట్లు బలవంతపెట్టి నాచేతఁ జెప్పించి వినియిప్పుడు మాటలాడ వేమి?

విదూ - నన్నుఁ గూడ బలాత్కరింతువా! యేమి?

రాజు - ఔను. బలాత్కరించెదను.

విదూ - అటులయిన విన శక్యము గాదు.

రాజు - దయ యుంచవయ్యా! బ్రాహ్మణుఁడా దయ యుంచు స్వేచ్ఛగాఁ జెప్పు?

విదూ - అటులయిన వినుము పూజ్యురా లయినవాసవదత్తాదేవి మీఁద నాకిష్టమే. పూజ్యురా లయిన పద్మావతీ దేవి యువతీరత్నము చక్కనిచుక్క కోపమన్నమాట లేదుకదా! అహంకార మేమో యెఱుఁగనే యెఱుఁగదు మాట తేనెతేటగదా? పైఁగా దయారాశి. ఈగుణములకేమి! ఇంత కన్న గొప్పగుణము మఱొకటి యున్నది ఆమెయొద్ద ఆర్యవసంతకుఁ డేడియేడి యని యెంతో యంతదయతోఁ బూఁట పూఁటకు నన్నామె కనుఁగొని, పంచభక్ష్యపరమాన్నములతో భోజనము పెట్టించి యాదరించుచుండును.

వాస - (తనలో) బాగు. వసంతకా! బాగు. ఇప్పుడు తలఁచుకో వలసిన దామాటె!

రాజు - ఉండు. ఉండు. వసంతక! ఇది యంతయు వాసవదత్తతోఁ జెప్పి నీపనిఁ బట్టించెదను.

విదూ - ఇంక నెక్కడి వాసవదత్త? వాసవదత్త చిరకాలము క్రిందటనే పోయినది.

రాజు - (విషాదముతో) ఔను. వాసవదత్తపోయినది.

ఆ.వె. *పరుసమ్మైననీదు పరిహారమునఁ జేసి*
కరము నాదుమనసు కలఁతఁ జెందె
నందుచేతఁ దొంటియభ్యాసవశమున
మాట జాఱి వచ్చె నోటినుండి.

పద్మా – ఆహాహా! కథాయోగము మిక్కిలి రమణీయముగా నున్నది నృశంస కుఁడగు వసంతకుఁడు వితండవాదము చేసి మనసు కలఁచినాఁడు.
వాస – (తనలో) మేలు. మేలు. ఇప్పుడు నాకు నమ్మిక కలిగినది. ఎదుట లేనప్పుడు చెప్పిన యిటువంటిమాట మిక్కిలి ప్రియమయి నమ్మఁదగి యుండును గదా?
విదూ – మిత్రుఁడా! ఊరడిల్లుము. విధినిర్ణయము దాఁట శక్యము గానిది కదా!
రాజు – మిత్రుఁడా! నీవు నాయవస్థ నెఱుంగవు.

చ. *విడిచితి దుఃఖ మట్లయినఁ బ్రేముడి నెమ్మది వ్రేళ్ళువాఱుటన్*
సడలక క్రొత్త దయ్యెడు విషాదము జ్ఞప్తికి వచ్చినప్పు డీ
వడువున నీప్రయాణమున వాసవదత్తఋణంబు దీర్పఁతిన్
గడుకొని బాష్పముల్ విడిచి, గావున బుద్ధిప్రసన్న మౌనిఁకన్.

విదూ – ఈయనముఖ మశ్రుపాతముచేతఁ గలుష మయినది. కావున మొగము గడుగుకొనుటకు జలముఁదెచ్చెదను.

(అని వెళ్ళు చున్నాఁడు.)

పద్మా – అమ్మా! భర్తగారిముఖము బాష్పపటాలాంతరిత మయినది మనము వెళ్ళుదము
వాస – అట్లే చేయుదము పోనీ, నీవుండుము వగచుచున్న భర్తను విడిచిపోవుట తగదు నేనే వెళ్ళెదను.
చేటి – ఈయమ్మ చెప్పినది బాగుగనున్నది. రాజపుత్రీ! భర్తగారి సన్నిధికిఁ బొమ్ము.
పద్మా – వెళ్ళుదునా?
వాస – సఖీ! వెళ్ళు

(అని నిష్క్రమించుచున్నది)

విదూ- (తామరాకులలో నీరు పోసికొనివచ్చి) ఇదిగో పూజ్యారాలయిన పద్మావతి.
పద్మా - అయ్యా! వసంతకా! అదియేమి?
విదూ - అదేయిది. ఇదేయది.
పద్మా - అయ్యా! చెప్పుఁడి. చెప్పుడి
విదూ- అమ్మా! వాయువశమున జెల్లుపుప్పొడి కనులం బడుట వలనఁ బ్రభువుగారి కనులనుండి బాష్పములువచ్చినవి కావున ముఖము కడుగుకొనుట కీజలముఁ దీసికొనివెళ్ళి యిమ్ము.
పద్మా - దయావంతుల పరిజనులు సయితము దయావంతులే యగుదురు (భర్తను సమీపించి) ఆర్యపుత్ర! జయము! జయము! ఇదిగో ముఖోదకము.
రాజా - ఓహో! పద్మావతియా! (అపవారించి) వసంతక! ఇదేమి?
విదూ - (చెవిలో) ఈలాగున సరిది చెప్పితినిలే (అని రహస్యముఁ జెప్పుచున్నాఁడు.)
రాజా - బాగు. వసంతక! బాగు. (మొగము కడుగుకొని) పద్మావతీ కూర్చుండుము.

గీ. *శారదస్వచ్ఛచంద్రికాగౌరమైన*
కాశపుష్పపరాగంబు గాలి కెగిజీ
వచ్చి నేత్రద్వయంబున బడుటచేత
నీరు గ్రమ్మెను నెమ్మోము నీరజాక్షి
(తనలో)

గీ. *క్రొత్త పెండ్లికూఁతు రీకువలయాక్షి*
సత్యమును విన్నఁ గరము విషాద మొందు
పడఁతి యెంతయు ధీర స్వభావురాలె
కాని స్త్రీస్వభావం బతికాతరంబు.

విదూ - అయ్యా! మధ్యాహ్నమయినది. పూజ్యుఁడయిన మగధరాజు నిన్నుఁ బురస్కరించుకొని మిత్రదర్శనము చేయవలసిన సమయ మిదే.

సత్కారము సత్కారము చేతఁబ్రతిగ్రహింపఁబడి ప్రీతిని గలుగఁజేయును.
కావునరమ్ము. పోవుదము.

రాజు - మంచిది. ఇదియుత్తమము (లేచి)

గీ. *ఉత్తమ విశాలగుణముల కునికిపట్టు*
లధికసత్కార కర్తలు నైనజనులు
తఱచుగాఁ గానఁబడుచుంద్రు ధరణియందు
వారిసౌజన్య మెఱిఁగినవార లరిది.

(అందఱు నిష్క్రమింతురు)

చతుర్థాంకము.

***

స్వప్నవాసవదత్తనాటకము
పంచమాంకము

(అప్పుడు పద్మినిక ప్రవేశించుచున్నది.)

పద్మి – మధుకరికా! మధుకరికా! త్వరగారావే!

మధు – (ప్రవేశించి) సఖీ! ఇదిగో వచ్చితిని. ఏమిచేయవలయును?

పద్మి – సఖీ! రాజపుత్రి పద్మావతి తలనొప్పిచేత బాధపడుచున్నదని నీవెఱుఁగవా!

మధు – అయ్యో! అయ్యో!

పద్మి – చెలీ! నీవు వేగము వెళ్ళి యీమాట పూజ్యురాలయిన యావంతికతోఁ జెప్పుము. భర్తృదారికకుఁ దలనొప్పి వచ్చి నదని మాత్రముచెప్పుము. అంతట నామె వెంటనేవచ్చును.

మధు – సఖీ! ఆమె యేమి చేయఁగలదు?

పద్మి – ఏమిచేయగలదా? మనోహరము లయిన కథలు చెప్పి శీర్షవేదనఁ బోఁగొట్టి వినోదముఁ గలిగించును.

మధు – సరే! రాజపుత్రిక నిమిత్తము పాను పెక్కడ వేసినారు?

పద్మి – సముద్రగృహమందు వేసినారు. నీవిపుడు వెళ్ళుము. భర్తగారికీ విషయము తెలియఁ జేయుటకు నేనార్య వసంతకుని వెదకెదను.

మధు – అట్లు చేయుము. (నిష్క్రమించుచున్నది)

పద్మి – ఇప్పుడు నే నార్యవసంతుని నెక్కడఁ జూడగలను.

(అప్పుడు విదూషకుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

విదూ – వాసవదత్తా వియోగదుఃఖితుఁ డయి యిపుడు పద్మావతీ పాణిగ్రహణముఁ జేసిన పూజ్యుఁ డయిన మావత్సరాజుయొక్క సుఖావహమగు కల్యాణ మహోత్సవము నందు నింతింతయనరాని మదనాగ్ని దాహము

జఱుగుచున్నదికదా! (పద్మినికంజూచి) ఏమే! పద్మినికా! ఇక్కడఁ దిరుగులాడుచున్నావు?

పద్మి – అయ్యో! వసంతక! భర్తృదారిక పద్మావతి తలనొప్పిచేత బాధపడుచున్నదని నీకుఁ దెలియలేదా?

విదూ – నిజముగానే నాకుఁదెలియదు.

పద్మి – అటులయిన నిది రాజుగారి కెఱింగింపుము. ఈలోపుననేను సత్వరముగా శీర్షానులేపనము దెచ్చెదను.

విదూ – పద్మావతికిఁ బానుపెక్కడ వేసినారు?

పద్మి – సముద్రగృహమందు వేసినారు.

విదూ – సరి! నీవు వెళ్ళు నేను మహారాజుగారితో విన్నవించుటకు బోయెదను.

(ఇద్దఱు నిష్క్రమించుచున్నారు.)

ఇది ప్రవేశము.

(అప్పుడు వత్సరాజు ప్రవేశించుచున్నాఁడు.)

రాజు –

మ. *మనమందిప్పుడు సైతముం దలంచెదన్ బల్మారు, కాలక్రమం*
బున నేవెండియు భార్యఁ జేకొని సుఖంబుంగాంచియున్ మంచుచే
హననంబొందిన పద్మినింబలెని యయ్యావంతిభూపాలనం
దన లావాణకదగ్ధదేహ జనవంద్యన్ నాదు ప్రాణప్రియన్.

విదూ – (ప్రవేశించి) త్వరపడవయ్యా! త్వరపడవయ్యా!

రాజు – ఎందునిమిత్తము?

విదూ – పూజ్యురాలయిన పద్మావతి తలనొప్పిచేత బాధపడుచున్నది.

రాజు – నీ కెవరు చెప్పిరి?

విదూ – పద్మినిక చెప్పినది.

రాజు – హా! కష్టము.

మ. *వరరూపంబు గుణంబులుం గల ప్రియన్ బద్మావతిం జేకొనన్*
జిరకాలాగతమైన శోకము శమించెన్ గొంత నాకిత్తతిన్
గరమున్ దుఃఖమువద్ద ప్రాణి నగుటన్ జాడ్యం బొకింతైన నీ
తరుణిన్ వాసవదత్త నుంబలెనె నేఁదర్కింతుఁ జిత్తంబునన్.

పద్మావతి యెక్కడ నున్నది?

విదూ – సముద్రగృహమందుఁ బండుకొనియున్నది.

రాజు – అట్లయిన నక్కడకు మార్గముఁ జూపుము.

విదూ – దయచేయుఁడు దయచేయుఁడు (ఇద్దఱు నడుచుచున్నారు.)

విదూ – ఇదే సముద్రగృహము. లోపలికిఁ దయచేయుఁడు.

రాజు – ముందు నీ వఱుఁగుము.

విదూ – సరే! (కొంచెమునడచి) హా! చచ్చితి, చచ్చితి. నీవు రాకు. ఉండు. ఉండు అక్కడ.

రాజు – ఎందుచేత?

విదూ – ఇదిగో నిక్కడ దీపఁపు వెలుఁగున బావు నేలమీఁద మెలమెలలాడుచున్నట్లు కనఁబడుచున్నది.

రాజు – (దగ్గఱకుఁబోయి చూచి చిఱునవ్వుతో) ఏమి! మూర్ఖుని సర్పభ్రాంతి!

గీ. *ఔరః! ద్వారబంధమున వ్రేలాడుచున్న*
పొడవు పూదండ తెగిపోయి పుడమినిఁబడి
గాలిచే రాత్రిజరజర గదలుటఁ గని
భ్రమసినాఁడవు నీ నది పాముటంచు.

విదూ – (నిరూపించి) నీవు సరిగా జెప్పితివి. ఇది పాము కాదు (ప్రవేశించి చూచి) పూజ్యురాలయిన పద్మావతి యిక్కడకు వచ్చి వెళ్ళిపోయినదని యూహించుచున్నాను.

రాజు – మిత్రుడా! ఆమె రానేలేదని తలంచెదను.

విదూ – నీవెట్లెఱుఁగుదువు?

రాజా – ఇందు దెలిసికొనఁదగిన దేమున్నది. చూడు–

ఉ. *తలిమము వంగలేదు, ముడుతల్ వడి దుప్పటి నల్గలే దిటన్*
దలపయిఁ బాయుమందు లుపధానము నెప్పుట నంటలేదు రో
గులకనుఁదోయి కింపులొన గూర్పిడి శోభలు సేయలేదు పోఁ
గలుగునె బైటికిన్ స్వయముగా దిగి మంచము రోగి యింతలోన్

విదూ – అటులయిన నీశయ్యమీఁద క్షణము కూర్చుండి యామె రాకను బ్రతీక్షింపుము.

రాజా – మంచిది (కూర్చుండి) మిత్రుఁడా! నిద్రవచ్చుచున్నది. ఏ దయిన నొకకథ చెప్పుము.

విదూ – సరే! నేను కథఁ జెప్పెదను. నీ వూకొట్టుము.

రాజా – మంచిది.

విదూ – అనఁగనఁగ నుజ్జయిని యను పట్టణము కలదు. అక్కడ మిక్కిలి రమణీయములగు నుదయజ్ఞానములు కలవుగదా!

రాజా – ఉజ్జయినిమా టెందుకయ్యా!

విదూ – నీకీకథ యిష్టము లేనిపక్షమున మఱియొకకథఁ జెప్పెదను.

రాజా – మిత్రుఁడా! ఈకథ నాకిష్టముగాకపోలేదు.

మ. *వనజాతాక్షి యవంతి రాజసుతమున్ బ్రస్థానకాలంబునం*
దనమట్టంబుల నెల్ల లోఁదలఁచి వంతం గుంది యావాలుఁగ
న్గొనలం గూరిన బాష్పబిందువులపంక్తుల్ నాదువక్షస్థలిన్
నినిచెం బ్రేమను, నామనం బిపుడు దానిన్ జ్ఞప్తికిం దెచ్చెడిన్.

మఱియు –

గీ. *గాన మామెకు నే నేర్పుకాలమందు*
నన్నె చూచుచుఁ జేతివీణ దిగజాఱి
కలికి వాయించె వట్టియాకాశమందె
యదియు తలఁపునఁబాఱు నా కనునిమిషము.

విదూ - పోనీ, మఱియొకటి చెప్పెదవినుము. బ్రహ్మదత్త మనునగరము గలదు. కాంపిల్యుఁ డను రాజందుఁ బాలించుచుండును.

రాజా - ఏమేమి?

విదూ - (తిఱిగి యట్లే యనుచున్నాఁడు)

రాజా - మూర్ఖుఁడా? నీవు కథ తలక్రిందుజేసి చెప్పుచున్నావు. రాజు బ్రహ్మదత్తుఁడు. నగరము కాంపిల్యమనిచెప్పుము.

విదూ - ఏమిటి! రాజు బ్రహ్మదత్తుఁడా? నగరము కాంపిల్యమా? సరి!

రాజా - ఔ నాలాగే!

విదూ - అట్లయిన నీవొకక్షణమూరకుండుము. ఇంతలో నీ మాటలు పదిసార్లు వల్లించి నోటఁబట్టించుకొందును. రాజు బ్రహ్మదత్తుఁడు. నగరము కాంపిల్యము. రాజు బ్రహ్మదత్తుఁడు నగరము కాంపిల్యము (అనివల్లించి) వినవయ్యా! కథ చెప్పుచున్నాను. అయ్యో! ఈయన నిద్రపోయినాఁడే! పోనీ మిక్కిలి చలివేయుచున్నది. ఇంతలో దుప్పటి తెచ్చుకొని వచ్చెదను.

(నిష్క్రమించుచున్నాఁడు)

(అప్పుడావంతి కావేషముతో వాసవదత్తయు, నొకచేటియుఁ బ్రవేశించు చున్నారు.)

చేటి - అమ్మా! రమ్ము. రమ్ము. భర్తృదారిక తలనొప్పిచేత మిక్కిలి బాధపడుచున్నది.

వాస - పద్మావతి యెక్కడ బండుకొనినది?

చేటి - సముద్ర గృహమందు.

వాస - అట్లయిన ముందు నడుపుము.

(ఇద్దఱు నడుచుచున్నారు.)

చేటి - ఇదే సముద్రగృహము. అమ్మా! లోపలికఱుఁగుము. ఇంతలో నేను వెళ్ళి తలకురాయుమందుఁ దెచ్చెదను. (అని వెళ్ళుచున్నది.)

వాస - అహో! దేవతలు నాయెడ నిర్దయు లయినారుగదా! ఏలయన నావియోగము వలన దుఃఖించుచున్న భర్తగారికి మనోవిశ్రాంతి యొసఁగి

యీపద్మావతి సంతోషముఁ గలిగించుచునను కొనుచుండ నీమెయు నస్వస్థురాలయినదిగదా! లోపలికిఁ బోయెదను. (ప్రవేశించి చూచి) ఏమి యీ పరిజనము యొక్క పాలుమాలిక! అస్వస్థ యయిన పద్మావతి నొక్కతెను గేవలము దీప సహాయురాలుగాఁ జేసి యందఱను విడిచి పోయినారు. పాప మీ పద్మావతి నిద్రపోయినది. మేలుకొనుదాఁకఁ గూర్చుండెదను. మఱియొకచోటఁ గూర్చుండిన యెడల స్నేహము తక్కువ యని తోఁపవచ్చును. అందుచేత నీమె శయ్యమీఁదనే కూర్చుండెదను (కూర్చిండి) ఏమి చెపుమా! ఈపానుపుమీఁదఁ గూర్చుండగానే నామనస్సు మిక్కిలి యాహ్లాదముఁ బొందుచున్నది. అదృష్టవశమున శ్వాసములు తెంపులేక సమముగా వచ్చుచున్నవి. తలనొప్పి కొంచె ముపశమించి నట్లున్నది. ఈపాన్పుమీఁద సగముభాగము వదలి యొత్తిగిలి పండుకొనుట చేత తక్కిన సగవు భాగవు మీఁద నేను బండుకొని తన్ను గౌఁగలించుకోవలసిన దని యూమెయభిప్రాయ మయినట్లు కనఁబడుచున్నది. అందుచేతఁ బండుకొనియెదను.

(శయనము నభినయించుచున్నది.)

రాజు – (కలవరించును.) హా! వాసవదత్తా!

వాస – (తొట్రుపడి లేచి) అమ్మో! పద్మావతి కాదు భర్తగారు. నన్నాయన చూచిరా యేమి! మహానుభావుఁ డయిన యౌగంధరాయణుని మహా ప్రతిజ్ఞాభారము నేఁ డీయన నన్నుఁ జూచుటచేత నిష్ఫల మయినది గదా!

రాజు – హా! ప్రియురాల! ప్రియశిష్యురాలా! నాకుఁబ్రత్యుత్తరమిమ్ము

వాస – ప్రాణేశ్వరా! ఉత్తర మిచ్చుచునే యున్నదానను.

రాజు – కోపగించితివా?

వాస – కోపగించలేదు. దుఃఖించుచుంటిని.

రాజు – కోపగింపకపోయినయెడల మాటాడవేమి?

వాస – ఇఁకమీఁదనా?

రాజు – విరహిక నీకు జ్ఞప్తికి వచ్చినదా! యేమి?

వాస - (రోషముతో) ఆ! చాలు. చాలు. ఇక్కడ సయితము విరహికమాటయా!

రాజు - అటు లయిన విరహిక నిమిత్తము నిన్నుఁ బ్రసన్నురాలుగఁ జేసికొందును. (చేతులు చాఁపుచున్నాఁడు)

వాస - ఎంతోసేపుంటిని. ఎవరయిన నన్నుఁ జూడవచ్చును కావున వెళ్ళుదును. కాదు కాదు మంచముమీఁదినుండి క్రిందికి వ్రేలాడుచున్న భర్తగారిహస్తమును మంచముమీఁద నుంచి పోయెదను. (అట్లు చేసి నిష్క్రమించుచున్నది.)

రాజు - మేలుకొని (తొందరతో లేచి) వాసవదత్తా! నిలు. నిలు. హా! కష్టము కష్టము-

గీ॥ సంభ్రమంబున నే వెంట జనుచునుండ
ద్వారపక్షంబు ఫెళ్ళునఁ దగిలె నాకు
నందుచేత భూతార్థమో యందరాని
యీప్సితమొ యిది సరిగ నే నెఱుఁగజాల॥

విదూ - (ప్రవేశించి) ఓహో! ఆయన మేలుకాంచినాఁడు.

రాజు - మిత్రుఁడా! నీకుఁ బ్రియము చెప్పెదను. వాసవదత్త బ్రదికి యున్నది.

విదూ - ఇఁక నెక్కడవాసవదత్త. వాసవదత్త పోయి చిరకాల మయినది.

రాజు - వయస్య! అట్లనవల దనవలదు.

గీ॥ నేను బాన్పుపైఁ బవళించి నిదురఁ బోవ
మిత్రమా! నన్ను మేల్కొల్పి మెలఁత పోయె
కాలిపోయిన దనిచెప్పి కల్లవార్త
నన్ను వంచించె సుమి రుమణ్వంతుఁ డపుడు॥

విదూ - ఆమె చనిపోయినది. ఇది యసంభావనీయము కాదు. ఆహా! ఉదయజ్ఞానము లని నేను జెప్పుటచేత నీ కామె జ్ఞప్తికి వచ్చి కలలోఁ గనఁబడి యుండవచ్చును.

రాజు -

కII *కలయే యిది యగునేనిన్*
మెలఁకువ రాకుంట నాకు మిక్కిలిప్రియమౌఁ
గలగా కిది భ్రమయైనన్
గలకాలము భ్రమయె యుండఁగాఁ దగు నాకున్॥

విదూ - వలదు. నిన్ను నీ విప్పు డపహసితునిం జేసికోవలదు. ఏమన? ఈరాజగృహమం దావంతి యనునొకయక్షిణి యున్నది. ఆమె నీకుఁ గనుపడిన దేమో.

రాజు - కాదు. కాదు.

గీII *కలను గని మేలుకాంచి నేఁ గంటి నెదుట*
గాటుకకుఁ బాసియుండిన కనులతోడ
గుబురుగా నున్న నిడుదముంగురులతోడ
దర్శనీయమైన పతివ్రతాముఖంబు.

మఱియు సౌమిత్రుఁడా! ఇటు చూడు. చూడు -

గీII *భయముతోడుతనా దేవి పట్టుకొన్న*
బాహు విదె! స్వప్నకలితసంస్పర్శ యయ్యుఁ
బాయకున్నది చూడు! మిప్పటికినయిన
హర్షరసముఁ గొల్పెడు పులకాంకురంబు॥

విదూ - అయ్యా! ఇప్పు డనర్థక విషయములను జింతింపవలదు. చతుశ్శాలకుఁ బోవుదము రమ్ము. రమ్ము.

కాంచుకీయుఁడు - (ప్రవేశించి) దేవా! జయము! జయము! మాదర్శక మహారాజుగారు మీతో నిట్లు మనవిఁజేయుచున్నారు. నీయ మాత్యుఁడగు రుమణ్వంతుఁడు నీశత్రువగునారుణిని మర్దించుటకు మహాబల సమేతుఁడయి వచ్చియున్నాఁడు. అందునకు రథగజతురగపదాతి మయ ములగు నావిజయాంగములు గూడ దండయాత్రకుఁ బోవుటకు సన్నద్ధము లయి యున్నవి. కావున నీవు లెమ్ము. ఇఁక నిట్లయ్యె నని నమ్ము -

సీ. నీప్రతాపముముందు నిలువంగ నోపక
బెదరి నీశత్రువుల్ భిన్నులైరి
సతతంబు భవదీయ సద్గుణాసక్తులై
పౌరులు మనముల నూఱడిలిరి
పార్ష్ణి భాగములు నీపయనంపువేళల
శత్రుశూన్యములుగా సలుపఁబడియె
శత్రుమర్దనమందుఁ జలుపంగఁ దగినట్టి
సాధనంబుల నెల్లఁ జిలిపినాఁడఁ
బరమపావన మగు భాగీరథీనది
దాఁటిపోయె నీదు దండు లెల్ల
వత్సదేశ మిపుడు స్వాధీన మయినది
వచ్చి యేలుమయ్య పార్థివేంద్ర॥

రాజు - మంచిది -

గీ॥ దంతితురఁగ పంక్తులచేత దాఁటనగుచు
నిశిత బాణకల్లోలనిర్భిద్ర మయిన
గాఢరణవార్ధి దారుణకర్మదక్షు
శత్రు నారుణి ముంచి నాశన మొనర్తు॥

(అందఱు నిష్క్రమించుచున్నారు)

ఇది పంచమాంకము.

***

స్వప్నవాసవదత్త నాటకము
షష్ఠాంకము

(అప్పుడు కాంచుకీయుఁడు ప్రవేశించుచున్నాఁడు)

కాంచు – ఎవరిక్కడ! రత్నతోరణ ద్వారమునొద్ద నెవరు కావలి యున్నారు?

(ప్రతీహారి ప్రవేశించును.)

ప్రతీ – ఇదిగో నే నున్నాను విజయను. ఏమి చేయవలయును?

కాంచు – విజయా! మహాసేనమహారాజా నొద్దనుండి రైభ్యసగోత్రుఁడగు కాంచుకీయుఁడును, మహాసేనుని భార్యయయిన యంగారవతీదేవి పంపిన వసుంధర యను వాసవదత్త దాదియు వచ్చి దర్శనార్థము ద్వారముకడ వేచియున్నారని వత్సరాజ్య లాభ ప్రవృద్ధోదయులగు నుదయన మహారాజాగారితో విన్నవింపుము.

ప్రతీ – అయ్యా! విన్నవించుట కిది సమయము కాదు. రాజాగారున్న ప్రదేశముకూడ మేము చొరరానిది.

కాంచు – సమయము గాకపోవుటనఁగా నెట్టిది?

ప్రతీ – అయ్యా! విను. ఇప్పుడు రాజాగారి శయ్యామహాప్రాసాదమున కెవరో వచ్చి వీణ వాయించిరి. ఆవీణాధ్వని విని "ఘోషవతీశబ్దమువలె వినబడుచున్నది", అని రాజాగారు పలికిరి.

కాంచు – తర్వాత! తర్వాత!

ప్రతీ – తరువాత రాజాగారక్కడకు వెళ్ళి "ఈవీణ యెక్కడనుండి వచ్చిన" దని యడిగిరి. అందునకు వీణవాయించునత డిట్లు చెప్పెను. "అయ్యా! యిది నర్మదాతీరమం దొకతీగకుందగులుకొని యుండఁగా నేనుజూచితిని. దీనితో మీకుఁ బ్రయోజనము గలదియేని మీరు తీసికొనవచ్చును". అనవుడు నావీణఁదీసికొని రాజాగారు దానిని దనశరీరమందుఁ బెట్టుకొని

శోకవశమున మూర్ఛిల్లిరి. అనంతరము కొంత సేపటికి మూర్ఛఁదెలిసి మొగము వాచునట్లు బాష్పపర్యాకులుఁ డయి వగచి రాజుగారు ఘోషవతీ! నీవు కనఁబడితివిగాని యామె మాత్రము కనుపడలేదు గదా! యని పలికిరి. అయ్యో! ఆసమయ మనఁగా నిట్టిది. ఇప్పు డెట్లు విన్నవింతును.

కాంచు – విజయా! విన్నవింపుము. భయము లేదు. ఈ విషయమును దానిసంబంధ మయినదీ.

ప్రతీ – అయ్యో! ఇదిగో విన్నవించెదను. రాజుగారదే! మహాప్రాసాదమునుండి శయ్యదిగి యిటు వచ్చుచున్నారు. ఇక్కడనే నివేదింపఁగలను.

కాంచు – అట్లే చేయుము.

(ఇద్దఱు నిష్క్రమించుచున్నారు.)

ఇది విష్కంభము.

(అప్పుడు వత్సరాజు విదూషకుఁడు ప్రవేశించుచున్నారు.)

రాజు –

చ. *శ్రుతిసుఖనాద! ఘోషవతి! సుందరిచొక్క పుఁజన్నుదోయిపైఁ*
దత జఘనస్థలంబుపయిఁ దార్కొని నిద్దుర వోవు నీవు నే
డతిశయదుర్దశం గని విహంగరజోగణ కీర్ణ దండవై
ప్రతిభయ ముప్పతిల్ల వనవాసము నేగతిఁ జేయఁగల్గితే.

మఱియు నోఘోషవతి! నీవు కఠినురాలవు.

సీ. *ఎలనాగజఘనమండలిఁ దాల్పఁగా బుట్టు*
బెడిదంబు లౌ పార్శ్వపీడనములు
క్రొంజెమ్మటలఁ దోగు గుబ్బలనడుమను
గడుహాయి నొడగూర్పు గౌఁగిలింత
లెదలోన విరహార్తి గదుర నం దలపోసి
తెలివచేసిన పరిదేవనములు
గానమధ్యమునందుఁ గంజాక్షి పలికెడు

చిఱునవ్వు దళుకొత్తు జిలుఁగుపలుకు
లేల దలఁపవె యొకసారియేని నీవు
యింతలోపల మఱచిపోయితివె వాని
నింతకఠినాత్మురాలవం చెఱుఁగ నెపుడు
దారుమయపదార్థములకు దయలు గలవె.

విదూ – మిత్రుడా! నీ విపు డతిసంతాపము నొందకుము.

రాజా – వయస్య! అట్లుకాదు.

గీ॥ చిరము నిద్రించియున్న నాచింత నిపుడు
మిత్రరత్నమ! యీవీణ మేలుకొలిపె
నెవతె కీఘోషవతి ప్రియం బెంతొ గూర్చు
నానెలంతమాత్రము నాకుఁ గానరాదు.

వసంతకా! శిల్పిజనముకడకుఁ బోయి ఘోషవతినిఁ జక్కఁజేయించి క్రొత్త దానింబలెఁ జేసి తీసికొనిరమ్ము.

విదూ – మీయాజ్ఞాప్రకారము చేయుదును. (వీణఁ దీసికొని పోవు చున్నాఁడు.)

ప్రతీహారి – (ప్రవేశించి) దేవా! జయము! జయము! ఉజ్జయినీ నాథుఁ డగుమహాసేనుని యొద్దనుండి రైభ్యసగోత్రుఁ డగు కాంచు కీయుఁడును, మహాసేనుని దేవి యగు నంగారవతి పంపిన వసుంధర యనువాసవదత్త దాదియు దర్శనార్థము వచ్చి ద్వారముకడ వేచియున్నవారు.

రాజా – అట్లయినఁ బద్మావతినిఁ గూడఁ బిలుచుకొని రమ్ము?

ప్రతీ – చిత్తము. దేవా! (ప్రతీహారి నిష్క్రమించుచున్నది)

రాజా – ఈవృత్తాంత మప్పుడే మహాసేనునకుఁ దెలిసినదా యేమి!

(అప్పుడు సపరివారయై పద్మావతి ప్రవేశించుచున్నది.)

ప్రతీ – రాజపుత్రీ! రమ్ము! రమ్ము!

పద్మా – ఆర్యపుత్రా! జయము! జయము!

రాజా – పద్మావతీ! వింటివా? మహాసేనుని యొద్దనుండి రైభ్యసగోత్రుఁడగు కాంచుకీయుఁడును, నాతని దేవి యగు నంగారవతి పనిచిన వసుంధర

యనువాసవదత్త దాదియువచ్చి వాకిటనున్న వారఁట!

పద్మా – ఆర్యపుత్ర! మాచుట్టాల కుశలవృత్తాంతము వినుట నాకు మిక్కిలి ప్రియము.

రాజు – వాసవదత్తస్వజనము నాస్వజనమేయని నీవు పలుకుట మిక్కిలి చక్కఁగా నున్నది. పద్మావతీ! కూర్చుండవేమి? ఇక్కడఁ గూర్చుండుము.

పద్మా – దేవరవారు నాతోఁ గలిసి కూర్చుండి వా రిద్దఱనుఁజూడఁ దలఁచుకొన్నారా?

రాజు – ఇందు దోషమేమి?

పద్మా – నేను దేవరవారి ద్వితీయకళత్రమ నని యాజన ముదాసీన కావచ్చును.

రాజు – కళత్రమును జూడఁదగిన జనమును గళత్రమును జూడనీయక పంపివేయుఁచున్నాఁడని నా కపకీర్తి గలుగును. అందుచేతఁ గూర్చుం డుము.

పద్మా – దేవరవారిచిత్తము. ఆర్యపుత్ర! వాసవదత్త తండ్రి గాని, తల్లిగాని యేమందురో యని నాకు విషాదముకలుగుచున్నది.

రాజు – అదియట్లే.

మ. *అతఁడేమా టనునో యటంచు మది నత్యంతంబు శంకింతు నా*
క్షితినాథాత్మజ నే హరించితిని రక్షింపంగలేనైతి, దు
ర్మతియై చంచలభాగ్యగర్వహతుఁడై ప్రాంచద్గుణభ్రష్టుఁడై
పితమోముం గనలేని పుత్రునిగతిం భీతిల్లెదన్ నేఁ గడున్.

(అప్పుడు కాంచుకీయుఁడు, దాది, ప్రతీహారి, ప్రవేశించుచున్నారు.)

కాంచు – ఓహో!

ఉ. *అల్లుఁడు రాజ్యమున్ బడసెనంచు వినన్ ముదమయ్యెడున్ మహీ*
వల్లభపుత్రిచావు దలపం జనియించును వంతదైవమా?
యల్లుని రాజ్య మన్యజనహస్తగతం బయి పోక యుండినన్
బిల్ల సుఖించియున్న నికనీ వొసరింపనిభద్ర ముండునే.

ప్రతీ – వారె? రాజుగారు. సమీపింపుఁడు

కాంచు – (సమీపించి) మహారాజా! జయము! జయము!

దాది – దేవా! జయము! జయము!

రాజు – (సగౌరవముగా) అయ్యా!

గీ. *కోరఁదగినట్టి చుట్టంబు గురువు నాకు*
జగతిలోఁ గలరాజవంశముల కెల్ల
మాటమాత్రాన నుదయాస్తమ యవిధాత
కుశలియై యున్నవాఁడె యాక్షోణివిభుఁడు.

కాంచు – ఆహా! మహాసేనునకుఁ గుశలమె. ఇక్కడి సర్వజనులకుశలము వినఁగోరుచున్నాఁడు.

రాజు – (లేచి) మహాసేనుఁ డేమి యాజ్ఞాపించుచున్నాఁడు?

కాంచు – వైదేహీపుత్రుఁడ వయిననీ కివినయ మనురూపమయినదే. అయ్యా! మహాసేనునిసందేశమును దేవర కూర్చుండియే వినవచ్చును.

రాజు – మహాసేనుని యాజ్ఞాప్రకారము చేసెదను. (కూర్చుండును.)

కాంచు – "అదృష్టవశమున శత్రువులచే నపహరింపఁబడిన రాజ్యము మరలఁజే జిక్కిన"దని సంతసించుచున్నాము. ఏలయన –

గీ. *పంద లగువారియందు దుర్బలులయందుఁ*
బ్రభవ మొంద దుత్సాహంబు వసుధ నేల
నరయ నుత్సాహవంతులే యనుభవింత్రు
తఱుచుగా రాజ్యలక్ష్మిని ధరణియందు.

రాజు – ఇది యంతయు మహాసేనుని ప్రభావమే.

మ. *మును నన్నాతఁడు గెల్చి బిడ్డవలెనే పోషించి లాలించె నా*
తనికన్యన్ గికురించి తెచ్చితిని కాంతం గావలే నైతిఁ దా
వినయుం బుత్రికవావు నెప్పటివలెన్ బ్రీతిన్ ననుం జూచు నా

యనయే హేతువు వత్సదేశము లిటుల్ స్వాధీన మిష్టాటకున్

కాంచు – ఇదే! మహాసేనుని సందేశము. అంగారవతీ దేవి సందేశము నేదాది యెఱిగించును.

రాజు – హా! తల్లీ!

గీ. *షోడశాంతఃపుర జ్యేష్ఠ శుద్ధచరిత*
నగరసౌభాగ్యదేవత నయవిశాల
నా(ప్రవాసంబుఁ దలఁపోసి నవయుతల్లి
కుశలముగ నున్నది గదమ్మ! కొఱఁతలేక.

దాది – ఆదేవి కుశలముగా నున్నది. దేవరవారి సర్వగతికుశల మడుగుచున్నది.

రాజు – సర్వగతకుశలమా! అమ్మా! కుశల మీ విధముగానున్నది.

దాది – దేవరవా రీవిధముగా నతిమాత్రసంతాప మొందఁ దగదు.

కాంచు – దేవా! ఊఱడిల్లుము. ఈవిధముగా దేవరవారిచేత ననుకంప్యమాన యగువాసవదత్త మృతినొందియు బ్రతికి యున్నది. కాకపోయినను –

గీ. *ఎవ్వఁ డెవనిఁ గావఁ గలఁడు మృత్యువేళఁ*
ద్రాఁడు తెగఁ జేఁద నెవ్వఁడు దాల్ప నోపు
నడవివంటిది సుమ్మి యీాయఖిలజగము
సారెసారెకుఁ బుట్టుచుఁ జచ్చుచుండు.

రాజు – అయ్యో! అట్లుకాదు. కాదు.

గీ. *శ్రీమహాసేనపుత్రి నాశిష్యురాలు*
ప్రాణసమ యైనప్రియురాలు పట్టమహిషి
తలఁప కుండంగ నామెను దరమె నాకు
నమిత దేహాంతరంబుల యందు నైన.

దాది – మాదేవి యిట్లు మనవిసేయుమన్నది – "వాసవదత్తగతించినది. నీ వల్లుఁడ వయినను నాకును, మీమామగారికిని మా కుమారుఁడయినఁ గోపాలుఁ డెట్టివాఁడో నీవు నట్టివాఁడవే. అందుచేతనే మొదట నిన్నుజ్ఞ

యునికిఁ దీసికొనివచ్చి, వీణనేర్పుటయను నెపముపెట్టి యనగ్ని సాక్షికముగా బిడ్డనిచ్చితిమి. నీమనశ్చపలత చేత వివాహమంగళ మహోత్సవము కాకుండఁ గనే కన్యాసమేతుఁడవయి వెళ్ళితివి. పదపడి చిత్రపలకము నందు నీయొక్క యుఁ వాసవదత్తయొక్కయుఁ బ్రతికృతులు నిర్మింపజేసి వివాహ మహోత్స వము గావించితిమి. ఆచిత్రఫలక మిదిగో నీయొద్దకుఁ బంపితిమి దానిం జూచి సుఖపడుము."

రాజు - ఓహో! ఆపూజ్యురాలు కృప యుట్టిపడునట్లును దగినట్లును జెప్పినది.

గీ. అమ్మహాదేవి సెలవిచ్చినట్టిమాట
ప్రియము రాజ్యలాభములు నూఱింటికంటె
నధికదోషంబుఁ జేయునాయందునయిత
మంతయనురాగమును నిల్పినందువలన.

పద్మా - ఆర్యపుత్ర! చిత్తరువులో నున్నగురుజనమును జూచి నమస్కరింపవలయు నని కోరుచున్న దానను.

దాది - భర్తృదారికా! చూడు చూడు (అని చిత్రఫలకమును జూపుచున్నది)

పద్మా - (చూచి తనలో) అహో! ఇది యచ్చముగాఁ బూజ్యురాలయిన యావంతికవలె నున్నది (ప్రకాశముగా) ఆర్యపుత్ర! ఈప్రతికృతి పూజ్యురాలయిన వాసవదత్త పోలిక నున్నదా!

రాజు - పోలిక గాదు. ఆమెయే యని తలంచెదను.

గీ. సాటిలేనట్టి యీమేనిచాయ కకట!
యట్టిదారుణదురవస్థ యెట్టుగలిగె
నతివవదనమాధుర్యంబు నక్కటకట!
యెట్లు దహియించెనో యగ్ని యెఱుఁగరాదు.

పద్మా - దేవరవారిప్రతికృతిని జూచి యిది వాసవదత్తరూపముతో సరిగా నున్నదో లేదో చెప్పఁగలను.

దాది - రాజపుత్రీ! చూడు! సరిగాఁ జూడు!

పద్మా - (చూచి) మీబొమ్మ మీరూపమునకు సరిగా నుండుటచేత వాసవదత్త ప్రతికృతియు నామెరూపమునకు సరిగా నుండుటకు సందేహము లేదు.

రాజా - దేవీ! చిత్తరువును జూచినది మొదలు ఖేదమోదములు రెండింటితోఁ గూడినట్లు కనుపడుచుంటివేమి?

పద్మా - ఆర్యపుత్రా! ఈప్రతికృతిలో సరియయినరూపముగల స్త్రీ యిక్కడనున్నది.

రాజా - వాసవదత్త కాదు గద!

పద్మా - ఏమో!

రాజా - అట్లయిన నామెను శీఘ్రముగా రప్పింపుము?

పద్మా - ఆర్యపుత్ర! నేను కన్యనయి యుండినకాలమున నొకానొక బ్రాహ్మణుఁడు "ఈమె నాచెల్లెలు ప్రోషితభర్తృక, పరపురుషుని జూడ నొల్లదు". అని చెప్పి యామెను నాయొద్దన్యాసముగా నుంచెను. కాఁబట్టి యామెను నాతోఁగూడఁ దీసికొనివచ్చెదను. అప్పుడు మీరు చూచి తెలిసికొనవచ్చును.

రాజా -

గీ. *చెలియ నిజముగా విప్రునిచెల్లెలైన*
స్పష్టముగఁ బరస్త్రీ యంచుఁ బలుకవచ్చుఁ
జిత్రముగ నప్పుడప్పు డీధాత్రియందు
మానిసినిఁ బోలుమానిసి గానఁబడును.

ప్రతీ - (ప్రవేశించి) దేవా! జయము! ఉజ్జయినీనివాసి యగు బ్రాహ్మణుఁ డొకఁడు దేవిగారిహస్తమునందుఁ దనచెలియలని చెప్పి యొకస్త్రీని న్యాసముగా నుంచినాఁడఁట. ఆన్యాసము నిప్పుడు తిరిగి పుచ్చుకొనుటకు వచ్చి ద్వారముననున్న వాఁడు.

రాజా - పద్మావతీ! ఇతఁ డాబ్రాహ్మణుఁడా

పద్మా - కావచ్చును.

రాజు - అభ్యంతరసముదాచారము నడపి యాబ్రాహ్మణుని శీఘ్రముగాఁ బ్రవేశపెట్టుము.

ప్రతీ - దేవరవారి చిత్తము. (నిష్క్రమించును.)

రాజు - పద్మావతీ! నీవును వెళ్ళి యామెను దీసికొనిరమ్ము?

పద్మా - దేవరవారి యాజ్ఞాప్రకారముచేసెద. (వెళ్ళుచున్నది)

(అప్పుడు ప్రతీహారియు యౌగంధ రాయణుఁడును బ్రవేశించుచున్నారు.)

యౌగం - (తనలో) ఆహో!

గీ. *మనుజపతిహితార్థము పట్టమహిషిఁ దాచి*
యతనికి హితంబుఁ జేసితి నంచు నెఱిఁగి
కార్యసిద్ధిని గనియు నీక్ష్మాతలేంద్రు
డే మనునొ యంచు శంకింతు హృదయమందు.

ప్రతీ - వారె! మహారాజుగారు సమీపమునకు దయచేయుఁడు.

యౌగం - దేవా! జయము! జయము!

రాజు - ఈస్వరమెప్పుడో విన్నట్లున్నది ఓబ్రాహ్మణుఁడా! నీ చెల్లెలిని బద్మావతీ హస్తమందు న్యాసముగా నుంచితివా?

యౌగం - ఔను. ఉంచితిని.

రాజు - అట్లయిన నీతనిచెల్లెలిని వేగముగాఁ దీసికొనిరండు.

ప్రతీ - చిత్తము. (అనివెళ్ళును.)

(అప్పుడు అవంతిక, పద్మావతి, ప్రతీహారి ప్రవేశించుచున్నారు.)

పద్మా - అమ్మా! రమ్ము! రమ్ము! నీకుఁ బ్రియము చెప్పెదను.

అవంతి - ఏమి, యేమి?

పద్మా - నీయన్నగారు వచ్చినారు.

అవం - సంతసమె! ఆయన కిప్పటికయిన జ్ఞప్తికి వచ్చినది.

పద్మా - ఆర్యపుత్రా! జయము! జయము! న్యాసముగా నుంచఁబడినయామె యిదిగో!

రాజు – పద్మావతీ! న్యాసమును సాక్షులయెదుట నీయవలయును. ఈ రైభ్యగోత్రుఁడును నీవసుంధరయు సాక్షులు కాఁగలరు.

పద్మా – అమ్మా! వసుంధరా! ఇదిగో నీపూజ్యురాలు

దాది – (అవంతికను నిరూపించి చూచి) అమ్మో! మాభర్తృదారిక వాసవదత్త.

రాజు – ఏమి! మహాసేనపుత్రి యగుదేవియా! అట్లయిన నీవు పద్మావతీసమేతవై యంతఃపురము ప్రవేశింపఁ దగదు. ఈమె నాచెల్లెలు గదా!

రాజు – నీ వేమనియెదవు? ఈమె మహాసేనపుత్రి కాదా?

యౌగం – ఓరాజా!

గీ. ప్రభవ మొందితి భారతవంశమందు
నీతివిదుఁడవు విజ్ఞాననిధివి శుచివి
దృఢమతివి రాజధర్మోపదేశకుఁడవు
పరసతిని బల్మిచే నిట్లు పడయఁ దగదు.

రాజు – సరే! అట్లయిన రూపసాదృశ్యమును జూతము. యవనికం దొలగింపుఁడు.

యౌగం – స్వామీ! జయము! జయము?

వాస – (తెరఁ దొలఁగించి) ఆర్యపుత్రా! జయము! జయము!

రాజు – అహో! ఈయన యౌగంధరాయణుఁడా! ఈమె మహాసేనపుత్రియా! (ఇద్దఱను గౌఁగలించుకొని)

క. ఇది కలయా, నిజమా! యా
సుదతిని వెండియును నేను జూచితి నిట నీ
ముదితయె యూగతిఁ గనుపడి
యదయత ననుఁ గన్నుఁ బ్రామి యానాఁ డటిగెన్.

యౌగం – స్వామీ? దేవినిఁ దాఁచి నేను దేవరవారియెడ మహాపరాధము చేసితిని. కావున దేవరవారు నన్ను క్షమింప వేఁడుచున్నాఁడను.

(అనిపాదములమీఁదఁ బడుచున్నాఁడు)

రాజు – (లేవనెత్తి) ఓయీ! నీవు యౌగంధరాయణుఁడవా?

మ॥ *కపటోన్మాదములన్ నటించియును, సంగ్రామంబులం జేసియుం*
జపముల్ సల్పియు శాస్త్ర దృష్టములు మంత్రంబుల్
ప్రయోగించియున్
విపదంభోధిని మజ్జమానుల మమున్ వేమారు యత్నంబులం
గృపతోఁజేసి సముద్ధరించితివిగా నీమేలు సామాన్యమే॥

యౌగం – మేము స్వామిభాగ్యమునే యనుసరించి పోవువారము.

పద్మా – ఓహో! ఈమె పూజ్యురాలయిన వాసవదత్త. అవ్వా! సఖీజనవ్యాపారములయందు నిన్నుంచి నేను సముదాచారము దాఁటి తప్పుజేసితివి. కాఁబట్టి తలవంచి వేఁడుకొందును. క్షమియింపుము.

వాస – (పద్మావతిని లేవనెత్తి) సౌభాగ్యవతీ! లెమ్ము లెమ్ము న్యాసమని పేరుపడసిన నాశరీరమే యపరాధము చేసినది. తప్పునీదికాదు.

రాజు – వయస్య! యౌగంధరాయణా! దేవిని దాఁచుటలో నీయభిప్రాయ మేమి?

యౌగం – కౌశాంబీనగరమును మఱల సంపాదింపవలయునని.

రాజు – పద్మావతిహస్తమం, దీమెను న్యాసముగా నుంచుట కేమి కారణము?

యౌగం – పద్మావతి మీకు దేవి యగునని పుష్పక భద్రాదులయిన యాదేశికులు సెలవిచ్చిరి.

రాజు – ఇది రుమణ్వంతుఁడు కూడ నెఱుఁగునా?

యౌగం – స్వామీ! అంద ఱెఱుఁగుదురు.

రాజు – అహో! రుమణ్వంతుఁ డెంతమోసఁగాఁడు.

యౌగం – దేవా! వాసవదత్తాదేవి కుశలముగా నున్నదనుశుభవార్త దెలియఁజేయుట కిప్పుడే రైభ్యుఁ డయిన యీకాంచుకీయుని వసుంధరను మహాసేనుని యొద్దకుఁ బంపుఁడు.

రాజా - వాసవదత్తా పద్మావతీ సమేతులమయి మన మందఱము గూడ నుజ్జయినికిఁ బోవుదము.

(భరతవాక్యము.)

క *జలనిధిపర్యంతంబై*
వెలయుచు నేకాతపత్రభృతమ్మై సీతా
చల వింధ్యకుండలం బగు
నిల ధృతి మారాజసింహుఁ డేలెడుగాతన్

(అందఱును నిష్క్రమించు చున్నారు.)

ఇది షష్ఠాంకము.

స్వప్నవాసవదత్తనాటకము.

సమాప్తము.

***

T.T.D. Religious Publications Series No : 699
Price : Rs. 10/-

Published by K.V. Ramanachary, I.A.S., Executive Officer,
Tirumala Tirupati Devasthanams, Tirupati and printed at T. T. D. Press, Tirupati.